బుధవారం
27-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 275
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫిలిప్పీన్స్‌కు భారత్ బాసట

న్యూదిల్లీ : ఫిలిప్పీన్స్ సార్వభౌమత్వానికి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం తెలిపారు. రక్షణ, భద్రత సహా నూతన రంగాల్లో మనీలాతో సహకారానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ దేశ పర్యటనలో ఉన్న జైశంకర్ అక్కడి విదేశాంగ మంత్రి ఎన్‌రిక్ మనాలోతో సమావేశం అనంతరం మాట్లాడారు. సముద్ర చట్టాలను అన్ని దేశాలు పాటించాలన్నారు. వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ ఆధిపత్యం, ఫిలిప్పీన్స్‌తో ఘర్షణపూరిత వాతావరణం నెలకొన్న వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రెండు ప్రజాస్వామ్య దేశాలు అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉన్నాయన్నారు. ప్రతి దేశానికి దాని సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కు ఉందని చెప్పారు.

నిరసన వెల్లువ

ప్రధాని ఇంటి ముట్టడికి ఆప్ యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- అరెస్టులు...నిర్బంధాలు
- దిల్లీ పోలీసు రాజ్యామా అంటూ నేతల ఆగ్రహం
- కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ దిల్లీ, హర్యానాలో ఆందోళనలు

న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రోడ్డెక్కారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'కేజ్రీవాల్ జిందాబాద్' నినాదాలతో లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం వైపు దూసుకుపోవడానికి ప్రయత్నించారు. అయితే పటేల్ చౌక్ వద్ద ఆప్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ నిర్బంధించారు. బలప్రయోగానికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. పోలీసుల తీరుపై ఆప్ శ్రేణులు మండిపడ్డాయి. దిల్లీ పోలీసులు దేశ రాజధానిని 'కోట'గా మార్చారని పార్టీ నాయకులు ఆరోపించారు. పార్టీ దిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 144 కింద నగరమంతటా ఆంక్షలు విధించిందన్నారు. దిల్లీ 'పోలీసు రాజ్యం'గా మారినట్లు కనిపిస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ ఇంటిని ఘెరావ్ చేయాలని ఆప్ శ్రేణులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రధానమంత్రి నివాసం, సెంట్రల్ దిల్లీ సహా దేశ రాజధానిలోని అనేక ప్రాంతాల్లో పోలీసులు తమ సిబ్బందిని, సాయుధ బలగాలను మోహరించడం ద్వారా భద్రతను కట్టదిట్టం చేశారు. లోక్ కళ్యాణ్

- మిగతా 2 లో

తీహార్ జైలుకు కవిత

14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
ముత్యంలా బయటికి వస్తానని ధీమా
ఒకటిన బెయిల్‌పై విచారణ

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం మంగళవారం తీహారు జైలుకు తరలించారు. ఈడీ కస్టడీ ముగియడంతో కవితను రౌస్ అవెన్యూ కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు హాజరుపరిచారు. ఈడీ తరపు న్యాయవాది జోయబ్ హుస్సేన్ ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించారు. కవితను 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపాలని కోరారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని, కొంతమంది నిందితులను ఇంకా ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, కవిత కుమారుడికి పరీక్షల షెడ్యూల్ విడుదల అయిందని, అందువల్ల మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. రెండువైపులా వాదనలు విన్న కోర్టు...కవితకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఏప్రిల్ 9 వరకూ కవిత్ రిమాండ్ కొనసాగనుంది. దీంతో ఆమెను తిహార్ జైలుకు అధికారులు తరలించారు. మరోవైపు కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారణ చేపట్టనున్నట్లు కోర్టు తెలిపింది. కోర్టుకు హాజరుపరిచిన సమయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇది తప్పుడు కేసు అని, మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు అని విమర్శించారు. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ధీమా వెలిబుచ్చారు.

తనను తాత్కాలికంగా జైలులో పెట్టవచ్చుని, కానీ తన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒక నిందితుడు బీజేపీలో చేరాడని, మరో నిందితుడికి ఎంపీ టికెట్ ఇచ్చిందని, మూడో నిందితుడు రూ.50 కోట్లు బాండ్ల రూపంలో బీజేపీకి ముట్టచెప్పాడని కవిత చెప్పారు. జై తెలంగాణ... జై కేసీఆర్ నినాదాలు చేస్తూ ఆమె కోర్టులోకి వెళ్లారు.

పారదర్శక విచారణ అవసరం

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా

న్యూదిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకోవడంపై అమెరికా స్పందించింది. భారత్‌లోని ప్రతిపక్ష నేత అరెస్టుకు

- మిగతా 2 లో

నేడు దిల్లీ హైకోర్టులో అరెస్టుపై విచారణ

న్యూదిల్లీ: మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో తనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు బుధవారం విచారించనుంది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి, ఆ తర్వాత ఈడీ రిమాండ్ విధించడం 'చట్టవిరుద్ధం' అయినందున ఆయనను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ న్యాయమూర్తి స్వర్ణకాంత

- మిగతా 2 లో

కమలంలో కలహం

- కీలక సమావేశానికి సీనియర్ల డుమ్మా
- కొత్తవారికి టికెట్లపై ఆగ్రహం
- జీవీఎల్, సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బీజేపీలో విభేధాలు భగ్గుమన్నాయి. పార్టీలోని సొంత నేతల నుంచే చిక్కులెదురయ్యాయి. రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్లు ఇప్పుడు తమ అసంతృప్తిని బాహాటంగానే ప్రదర్శించారు. ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో తమను పక్కనబెట్టి, కొత్త వారికి టికెట్లు ఇవ్వడంపై అసలైన బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కీలక సమావేశానికి వారు డుమ్మా కొట్టడంతో అధిష్టానానికి మింగుడుపడటం లేదు. ఏపీ బీజేపీ కీలక సమావేశానికి ఆ పార్టీ సీనియర్లు హాజరుకాలేదు. విజయవాడలో మంగళవారం పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన పదాధికారుల సమావేశానికి బీజేపీ సీనియర్ నేతలు జీవీఎల్, సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ వెళ్లకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎంతో కీలకమైన ఈ సమావేశానికి పార్టీ ఏపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ అరుణ్‌సింగ్ తదితరులు హాజరయ్యారు. బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితాలో అసలైన బీజేపీ నేతలకు టికెట్లు దక్కకపోవడంతో సీనియర్ నేతలు ఆగ్రహంతో సమావేశానికి గైర్హాజరైనట్లు తెలిసింది. పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పని చేస్తున్న వారికి సముచిత స్థానం కల్పించకుండా, ఇతర పార్టీల నుంచి ఇటీవల వలసలు వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. పార్టీ రాష్ట్ర శాఖ తీరుపై జీవీఎల్,

- మిగతా 2 లో

నేటి నుంచి 'మేమంతా సిద్ధం'

- ఇడుపులపాయ నుంచి జగన్ బస్సు యాత్ర
- ప్రొద్దుటూరులో భారీ బహిరంగ సభ
- రూట్‌మ్యాప్ విడుదల చేసిన తలశిల రఘురామ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈనెల 27వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. కడప జిల్లా ఇడుపులపాయ నుంచి వైసీపీ అధినేత, సీఎం జగన్ ఈ బస్సు యాత్రను నిర్వహిస్తారు. సిద్ధం సభల తరహాగానే 'మేమంతా సిద్ధం' యాత్ర కొనసాగుతుంది. ఈ యాత్ర షెడ్యూల్‌ను వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి సీఎం బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తారు. అనంతరం 1.30 గంటలకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో భాగంగా ఇడుపులపాయ నుంచి కుమారునిపల్లి, వేంపల్లి, సర్వరాజుపేట, వీరపునాయునిపల్లి (కమలాపురం), గంగిరెడ్డిపల్లి, ఊరుటూరు, యర్రగుంట్ల (జమ్మలమడుగు), పొట్లదుర్తి మీదుగా సాయంత్రం 4.30 గంటలకు ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం సున్నపురాళ్లపల్లి, దువ్వూరు, జిల్లెల, నాగలపాడు, బోధనం, రాంపల్లె క్రాస్, చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు. గతంలో సిద్ధం సభలు నిర్వహించిన పార్లమెంటు/జిల్లాలను మినహాయించి, మిగిలిన 21 జిల్లాల్లో సీఎం బస్సు యాత్ర కొనసాగుతుంది. ఈ యాత్రలో భాగంగా ఉదయం వివిధ సంఘాల ప్రతినిధులు, మేధావులతో సీఎం భేటీ అవుతారు. ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మధ్యాహ్నం పార్టీ ముఖ్య

- మిగతా 2 లో

అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాల నాయుడు

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్యాల కుమార్తె ఈర్లి అనురాధ
- వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రక్రియ పూర్తి

2లో

కేజ్రీవాల్ జైలుకు... గాలి బీజేపీలోకి...

రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: మద్యం కుంభకోణం పేరుతో దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను జైలుకు పంపిన బీజేపీ ప్రభుత్వం...మైనింగ్ అక్రమాలకు పాల్పడి, జైలుకెళ్లి, ఇప్పటికీ కేసులు ఎదుర్కొంటున్న గాలి జనార్ధనరెడ్డిని మాత్రం తమ చెంతకు చేర్చుకున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'ఇవేనా బీజేపీ చెబుతున్న నీతి రాజకీయాలు? భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడినప్పటికీ బీజేపీలో చేరగానే అక్రమార్కులంతా శుద్ధులైపోతారా' అని రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో బీజేపీని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ నీతిమాలిన, క్షుద్ర రాజకీయాలను ప్రజలందరూ గమనిస్తున్నారని

- మిగతా 2 లో

ఎన్నికల ప్రచారంపై తీవ్ర ఆంక్షలు

- ఇంటింటి ప్రచారానికీ అనుమతి తప్పనిసరి
- సమావేశాలు, కరపత్రాల పంపిణీకీ అనుమతి పొందాలి
- ముకేశ్ కుమార్ మీనా స్పష్టీకరణ

రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు తీవ్రం చేసింది. ఎన్నికల ప్రచారంలో డబ్బు దుబారాను నివారించేందుకు అభ్యర్థుల ఖర్చును పరిమితం చేయడం వరకు బాగానే ఉంది కానీ, ఇంటింటి ప్రచారానికి సైతం ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరి అనడం విమర్శలకు దారితీస్తోంది.

2లో

ఇదీ లోకం!

ప్రపంచ కుబేరుల జాబితాలో ట్రంప్

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సోమవారం మరచిపోలేని రోజుగా గుర్తుంటుంది. తీవ్రంగా భయపెట్టిన ఓ కోర్టు కేసులో ఆయనకు ఊరట లభించగా... మరోవైపు ఒక్కసారిగా ఆయన జీవితంలో ఎన్నడూ లేనంత సంపద వచ్చి చేరింది.

2లో

యువత భవిష్యత్తుకు భరోసా

వైసీపీ పాలనలో పరిశ్రమలు మూత: చంద్రబాబు

విశాలాంధ్ర-చిత్తూరు : యువత భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలన్నదే తన ధ్యేయమని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో మంగళవారం రెండోరోజు పర్యటనలో భాగంగా ముందుగా పట్టణంలోని బాబు నగర్‌లో టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావుతో కలిసి ఇంటింటా ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన యువతతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అరాచక పాలనతో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందు రాలేదని, ఉన్న పరిశ్రమల సైతం మూతపడ్డాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వారి భవిష్యత్తు అంధకారమైందన్నారు. ఐదు సంవత్సరాలుగా జాబ్ క్యాలెండర్ లేదు... డీఎస్సీ లేదన్నారు. ప్రస్తుత పాలకులకు రాష్ట్ర సంపదను దోచుకోవడమే దినచర్యగా మారిందన్నారు. గ్రూప్స్ వంటి పరీక్షలను కూడా అమ్మకానికి పెట్టిన ఏకైక ప్రభుత్వం వైసీపీనే అని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి కియా సంస్థను తీసుకువస్తే... నేడు ఈ ప్రభుత్వం అరాచకం వల్ల జాకీ, అమర్ రాజా వంటి సంస్థలు మూతపడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలంటే వాటాలు ఇవ్వాల్సిందేనని అన్నారు. కుప్పంలో భూగర్భ ఖనిజ

- మిగతా 2 లో

ప్రపంచ కుబేరుల జాబితాలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సోమవారం మరచిపోలేని రోజుగా గుర్తుంటుంది. తీవ్రంగా భయపెట్టిన ఓ కోర్టు కేసులో ఆయనకు ఊరట లభించగా... మరోవైపు ఒక్కసారిగా ఆయన జీవితంలో ఎన్నడూ లేనంత సంపద వచ్చి చేరింది. ట్రంప్‌నకు భారీ జరిమానా విధింపు విషయంలో పై కోర్టులో ఊరట లభించింది. అదే సమయంలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆయన కంపెనీ డీల్ ఒకటి పూర్తయింది. ఫలితంగా ఆయన ఆస్తుల విలువ భారీగా పెరిగింది. దీంతో బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లోని తొలి 500 మంది సంపన్నుల జాబితాలో ఆయన స్థానం దక్కించుకున్నారు. తాజా అంచనాల ప్రకారం ట్రంప్ సంపద విలువ 4 బిలియన్ డాలర్లు (రూ.33 వేల కోట్లు) పెరిగి 6.5 బిలియన్ డాలర్లకు చేరింది. గతంలో ఎన్నడూ ఆయన ఆస్తుల విలువ ఈ స్థాయిలో లేదని యూఎస్‌ఏ టుడే పేర్కొంది. తన సంపద గురించి గతంలో అసత్యాలు చెప్పిన కేసులో దిగువ కోర్టు విధించిన రూ.3,788 కోట్ల (45.4 కోట్ల డాలర్ల) భారీ జరిమానాను నిలిపివేయాలని కోరుతూ రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్ అప్పీల్స్ కోర్టును ఇటీవల ఆశ్రయించారు. అయితే, దిగువ కోర్టు ఉత్తర్వు అమలు కాకుండా నిలిపివేయటానికి అప్పీల్స్ న్యాయస్థానం ఓ షరతు విధించింది. పది రోజుల్లో రూ.1,460 కోట్ల(17.5కోట్ల డాలర్ల)ను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని జమ చేసినట్లయితే రూ.3,788 కోట్లను వసూలు చేయకుండా నిలుపుదల ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. ట్రంప్‌నకు చెందిన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' సంస్థ డిజిటల్ వరల్డ్ అక్విజేషన్ కార్ప్(డీడబ్ల్యూఏసీ)తో విలీనం ప్రక్రియ పూర్తయింది. ఇది దాదాపు 29 నెలలుగా సాగుతూ వస్తోంది. మార్కెట్‌లో డీడబ్ల్యూఏసీ షేర్లు ఒకేసారి 35 శాతానికి పైగా ర్యాలీ చేశాయి. దీంతో ట్రంప్ సంపద కూడా భారీగా పెరిగి 6.5 బిలియన్ డాలర్లకు చేరినట్లు సీఎన్‌బీసీ పేర్కొంది. విలీనం తర్వాత ఏర్పడ్డ కొత్త కంపెనీ మంగళవారం నుంచి నాస్‌డాక్‌లో డీజేటీ పేరిట ట్రేడింగ్ అయింది. అయితే ఈ నూతన కంపెనీలో వాటాలను ట్రంప్ కనీసం ఆరు నెలల పాటు విక్రయించకుండా ఉండాల్సి ఉంటుంది.

పాక్ నేవీ ఎయిర్‌స్టేషన్‌పై తిరుగుబాటుదారుల దాడి



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని రెండో అతిపెద్ద నేవీ ఎయిర్‌స్టేషన్ పీఎన్ఎస్ సిద్దిఖ్‌పై సోమవారం రాత్రి దాడి జరిగింది. బలూచిస్థాన్‌లో ఉన్న ఈ స్థావరంపై తిరుగుబాటుదారులు తుపాకులు, బాంబులతో విరుచుకుపడ్డారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. నలుగురు తీవ్రవాదులను హతమార్చారు. వారు లోపలికి ప్రవేశిస్తుండగానే గుర్తించి మట్టుబెట్టామని అధికారులు తెలిపారు. ఎయిర్‌స్టేషన్‌కు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించారు. ఈ స్థావరంలో చైనాకు చెందిన డ్రోన్లను పెద్ద ఎత్తున మోహరించినట్లు సమాచారం. ఈ దాడికి బాధ్యత వహిస్తూ 'బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ కాల్పుల్లో పాకిస్థానీ బలగాలకు చెందిన డజను మంది మృతిచెందినట్లు తెలిపింది. పాకిస్థాన్ సైన్యం మాత్రం దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. వారం రోజుల్లో ఈ ముఠా ఇలాంటి దాడికి యత్నించడం ఇది రెండోసారి. మార్చి 20న గ్వాదర్ పోర్టుపైనా తిరుగుబాటుదారులు దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనలో భద్రతా బలగాలు ఏడుగురిని హతమార్చాయి. బీఎల్‌ఏను పాకిస్థాన్ సహా అమెరికా, బ్రిటన్ ఉగ్రసంస్థగా గుర్తించాయి. పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రావిన్స్‌గా పిలిచే బలూచిస్థాన్ అనేక కొండలతో కూడిన ప్రాంతం. స్వాతంత్ర్యం కోసం ఇక్కడ అనేక గ్రూపులు కొన్నేళ్లుగా తిరుగుబాటు చేస్తున్నాయి. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టులను ఈ గ్రూపులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా బీఎల్‌ఏ వేర్పాటువాద సంస్థ చైనా పెట్టుబడులను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బలూచిస్థాన్‌లోని గ్యాస్, ఖనిజ వనరులను చైనా, పాక్ దోపిడీ చేస్తున్నాయని ఆరోపిస్తోంది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్)లో భాగంగా ఇక్కడి గ్వాదర్ పోర్ట్, ఇతర ప్రాజెక్టుల అభివృద్ధిలో చైనా పాలుపంచుకున్న విషయం తెలిసిందే.

విశాలాంధ్ర ప్రపంచం

నౌక ఢీ... కుప్పకూలిన బ్రిడ్జ్

వాషింగ్టన్: అమెరికాలో అనూహ్య ఘటన జరిగింది. నౌక ఢీకొనడంతో బాల్టిమోర్ నగరంలో ఏకంగా ఓ బ్రిడ్జ్ కుప్పకూలింది. మేరీలాండ్ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీ ఈ విషయాన్ని వెల్లడించింది. 'నౌక ఢీకొనడంతో ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జ్ కూలిపోయింది' అని ఎక్స్‌లో తెలిపింది. దీంతో పటాప్‌స్కో నది మీదుగా రాకపోకలు సాధ్యం కాదని డ్రైవర్లకు సూచించింది. ఈ ప్రమాదంలో వంతెనపై ఉన్న కొన్ని వాహనాలు నదిలో పడిపోయాయి. దాదాపు 20 మంది గల్లంతైనట్లు సమాచారం. స్థానిక కాలమానం ప్రకారం... సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీస్థాయి కంటైనర్ షిప్ ఈ వంతెనను ఢీకొట్టింది. దీంతో అది పేకమేడలా కూలిపోయిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఆ సమయంలో వారధి మీద ఉన్న పదుల సంఖ్యలో కార్లు నదిలో పడిపోయినట్లు సమాచారం. చైనాలో గత నెల ఇదే తరహా ఘటన జరిగింది. గ్వాంగ్జూ నగరంలోని పెరల్ నదిపై ఉన్న లిజింగ్షా వంతెనను ఓ నౌక బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఒక బస్సు సహా ఐదు వాహనాలు నదిలో పడిపోయాయి. ఇద్దరు చనిపోగా... మరో ముగ్గురి ఆచూకీ గల్లంతైంది. ప్రమాదం అనంతరం ఈ నౌక వంతెన మధ్యే చిక్కుకుపోయింది. నదిలో పడిపోయిన బస్సులో కేవలం డ్రైవర్ మాత్రమే ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది.

కేజ్రీవాల్ జైలుకు... గాలి బీజేపీలోకి...

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. రూ.100 కోట్ల మద్యం కుంభకోణం సాకుతో కేజ్రీవాల్‌ను బీజేపీ ప్రభుత్వం జైలుకు పంపేందుకు సిద్ధమైందని, ఇదే కేసులో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను ఏడాదికాలంగా కక్షపూరితంగా జైల్లోనే ఉంచిందని విమర్శించారు. వేలకోట్ల రూపాయల మైనింగ్ కుంభకోణానికి పాల్పడి, జైలుకెళ్లి, బళ్లారి జిల్లా నుండి వెలివేతకు గురైన గాలి జనార్దనరెడ్డిని మాత్రం బీజేపీ అక్కున చేర్చుకున్నదని మండిపడ్డారు. మరోపక్క ఏపీలో మద్యం అమ్మకాలలో వేల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ సాక్షాత్తు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కేంద్ర హోంమంత్రికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బీజేపీ దుష్ట నిర్ణయాలకు వంతపాడుతున్నందునే మోదీ సర్కారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దీనిని బట్టి బీజేపీ కక్షపూరిత రాజకీయాలు ప్రజలందరికీ అర్థమవుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలపై అక్రమ కేసులు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం...తమకు అనుకూలమైన వారు ఎన్ని అక్రమాలు చేసినప్పటికీ అక్కున చేర్చుకుంటుందన్నారు. వారి కేసుల మాఫీకి ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. ఇది బీజేపీ అవకాశవాద, నీచ, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు నిదర్శనమని నిందించారు. బీజేపీ చేస్తున్న నీతిమాలిన రాజకీయాలను, కక్షపూరిత విధానాలను ప్రజాతంత్రవాదులంతా తీవ్రంగా ఖండించాలని కోరారు.

నేటి నుంచి 'మేమంతా సిద్ధం'

(మొదటిపేజీ తరువాయి)

నేతలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం లేదా సాయంత్రం ఒక నియోజకవర్గంలో బహిరంగ సభ ఉండేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. కడప జిల్లాలో బస్సు యాత్ర పూర్తయిన వెంటనే, మరుసటిరోజు నిర్వహించే జిల్లా రూట్ మ్యాప్‌ను ఎప్పటికప్పుడు విడుదల చేస్తారు. తొలి 'మేమంతా సిద్ధం' సభ జరగనున్న ప్రొద్దుటూరులో ఏర్పాట్లను పూర్తి చేశారు. సిద్ధం సభలు తరహాగా సీఎం జగన్ కార్యకర్తలు, ప్రజల మధ్యకు వెళ్లేలా వేదిక దగ్గర నుంచి మధ్యలోకి ర్యాంపును ఏర్పాటు చేశారు. ప్రతి సభకు లక్షా 50 వేల నుంచి 2 లక్షల మంది హాజరయ్యేలా వేదికలను నిర్మిస్తున్నారు. ఈ బస్సు యాత్రల్లో భాగంగా వివిధ పార్టీలకు చెందిన నేతల చేరికలు ఉంటాయి. సీఎం జగన్ సమక్షంలో వారంతా పార్టీ కండువాలు కప్పుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే వైసీపీ 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను విడుదల చేసింది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తేదీ వరకూ దాదాపు 21 రోజులపాటు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కొనసాగే అవకాశం ఉంది. ఆ తర్వాత సీఎం జగన్ పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతారు. ఈ బస్సు యాత్ర మధ్యలోనే వైసీపీ మేనిఫెస్టో విడుదలకు పార్టీ ముఖ్య నేతలు కసరత్తు చేస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ: కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వెలుగుచూస్తున్న విషయాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, నాడు పీసీసీ అధ్యక్షుడు, నేటి సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి సమీపంలో ఇళ్లు అద్దెకు తీసుకుని ఆధునిక పరికరాలతో ఆయన ఇంట్లో ఏం మాట్లాడుకునేవారో రికార్డు చేశారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముగ్గురు పోలీసులు ఉన్నతాధికారులు అరెస్టు కావడం, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పేరు వెలుగులోకి రావడం దారుణమని పేర్కొన్నారు. నాటి అధికార పార్టీ తమ ప్రత్యర్థుల ఫోన్‌లను ట్యాపింగ్ చేయిస్తుందనేది అందరికీ తెలిసిందేనని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినా నాయకులందరినీ రాత్రికి రాత్రే హౌస్ అరెస్టులు చేసేవారని గుర్తు చేశారు.

ఎన్నికల ప్రచారంపై తీవ్ర ఆంక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు తీవ్రం చేసింది. ఎన్నికల ప్రచారంలో డబ్బు దుబారాను నివారించేందుకు అభ్యర్థుల ఖర్చును పరిమితం చేయడం వరకు బాగానే ఉంది కానీ, ఇంటింటి ప్రచారానికి సైతం ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరి అనడం విమర్శలకు దారితీస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఇకపై రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన అనుమతులను వివరించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రచార అనుమతుల కోసం 48 గంటలకు ముందుగానే సువిధా యాప్ ద్వారా లేదా నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అభ్యర్థులు నామినేషన్లు, అఫిడవిట్‌లు దాఖలు చేసేందుకు ముందస్తు అనుమతులు మంజూరు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సువిధా పోర్టల్‌ను ఈసీఐ డిజైన్ చేసినట్టు ఆయన తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి చేసే ఖర్చును ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి తప్పనిసరి అని తెలిపారు. స్థానిక రిటర్నింగ్ అధికారుల అనుమతితోనే అభ్యర్థులు ఓటర్ల ఇళ్లకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం ఆయా రాజకీయ పార్టీలు వినియోగించే స్టార్ క్యాంపెయిన్లు, ముఖ్య నేతలు వాడే వాహనాలకు సీఈవో నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజు పరిశీలనకు కూడా అభ్యర్థితోపాటు పోలింగ్ ఏజెంట్ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భవనాలపై నేతల ఫొటోలు, ప్రకటనలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులతో కలిసి తిరగకూడదని, అటువంటివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతోందని, ఎలాంటి కార్యక్రమం అయినా సువిధ పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు సీఈవో ఎమ్ఎన్. హరెంధిర ప్రసాద్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, బీజేపీ, సీపీఐ(మార్క్సిస్టు), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీ, టీడీపీ, వైసీపీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమలంలో కలహం

(మొదటిపేజీ తరువాయి)

సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి కేంద్ర నాయకత్వానికి లేఖలు రాసినా ఫలితం లేదని వాపోతున్నారు. దీంతో విజయవాడలో జరిగిన బీజేపీ ముఖ్య సమావేశానికి వారు దూరంగా ఉన్నట్లు ప్రచారముంది. ఇటీవల బీజేపీ విడుదల చేసిన ఆరు లోక్‌సభ స్థానాల్లో అరకుకు కొత్తపల్లి గీత, అనకాపల్లికి సీఎం రమేశ్, రాజమండ్రికి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, తిరుపతి వరప్రసాద్, రాజంపేట ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించారు. విశాఖ లోక్‌సభ స్థానాన్ని జీవీఎల్ నరసింహారావు ఆశించగా, అది పొత్తుల్లో భాగంగా టీడీపీకి వెళ్లింది. అక్కడ విశాఖ ఎంపీగా బాలకృష్ణ అల్లుడు భరత్‌కు టీడీపీ టికెట్ కేటాయించడంతో జీవీఎల్‌కు మొండిచేయి మిగిలింది. కొత్తగా పార్టీలోకి వచ్చిన సీఎం రమేశ్‌కు, కొత్తపల్లి గీత, వరప్రసాద్, కిరణ్‌కుమార్ రెడ్డికి పార్టీ టికెట్లు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఏపీ బీజేపీలో అసలైన బీజేపీ నేతలు, టీడీపీ నుంచి వచ్చిన బీజేపీ నేతలు ఉన్నారు. కొంతకాలంగా వారి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. అసలైన బీజేపీ నేతలేమో బీజేపీ ఒంటరిగా బరిలోకి దిగాలని ప్రతిపాదించగా, టీడీపీ నుంచి వచ్చిన బీజేపీ నేతలేమో పొత్తులతోనే పోటీ చేయాలని పట్టుపట్టారు. ఎట్టకేలకు బీజేపీ కేంద్ర నాయకత్వం దగ్గర టీడీపీ నుంచి వచ్చిన బీజేపీ నేతల మాటే చెల్లుబాటవడంతో బీజేపీ పొత్తులకు దిగింది. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా బీజేపీకి ఆరు లోక్‌సభ స్థానాలను, 10 అసెంబ్లీ స్థానాలను కేటాయించారు.

ఇప్పటివరకు లోక్‌సభ స్థానాలను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించగా, అసెంబ్లీ స్థానాలను ఏ క్షణంలో అయినా విడుదల చేసేందుకు రాష్ట్ర నాయకత్వం సిద్ధంగా ఉంది. జీవీఎల్, సత్యకుమార్, సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీ సీట్లను ఆశించి భంగపాటుకు గురయ్యారు. ఎంపీ సీట్లు దక్కకపోయినా కనీసం అసెంబ్లీ స్థానాల్లో సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి పోటీచేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. అయితే అసెంబ్లీ సీట్లు వారికి ఇచ్చే పరిస్థితులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కీలక సమావేశానికి ఆరుగురు ఎంపీ అభ్యర్థులు హాజరయ్యారు. బీజేపీ సీనియర్ నేతలు జీవీఎల్, సోము వీర్రాజు, సత్యకుమార్, విష్ణువర్ధన్ రెడ్డి డుమ్మా కొట్టడంపై ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఆరా తీస్తోంది. కూటమిలో భాగంగా బీజేపీ కేటాయించిన పది అసెంబ్లీ సీట్లపై చాలా మంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

నిరసన వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

మార్గ్ మెట్రో స్టేషన్‌ను మూసివేశారు. తదుపరి నోటీసు వచ్చే వరకు పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లలో ప్రవేశం, నిష్క్రమణను పరిమితం చేశారు. కాగా ఆప్ ఆందోళన కార్యక్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఆప్ సీనియర్ నేత సోమనాథ్ భారతి, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా, పంజాబ్ మంత్రి హర్జోత్ సింగ్ బెయిన్స్ ఉన్నారు. 'పోలీసు బలగాలతో ఈ ఉద్యమం ఆగదని నేను కేంద్రాన్ని హెచ్చరించాలనుకుంటున్నాను' అని రాయ్ పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలపై అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. మోదీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చినందున ఆప్ కార్యకర్తలు, నాయకులు ఉదయం నుంచి గుంపులుగా పటేల్ చౌక్ మెట్రో స్టేషన్‌కు చేరుకోవడం ప్రారంభించారు. పటేల్ చౌక్ ప్రాంతంలో నేర శిక్షాస్మృతికి చెందిన సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించారు. పోలీసులు ఎవరినీ గుమికూడేందుకు అనుమతించలేదు. ఇక్కడ ఎవరినీ గుమికూడనివ్వబోమని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. చౌక్ వద్ద ప్రదర్శనకు వచ్చేవారిని వెంటనే అదుపులోకి తీసుకుంటామని పోలీసు డిప్యూటీ కమిషనర్ (న్యూఢిల్లీ) దేవేశ్ కుమార్ గతంలో హెచ్చరించారు. దేశంలోని 'నియంతృత్వానికి' వ్యతిరేకంగా జరిగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమించేవారి పోరాటమని, మార్చి 31న రాంలీలా మైదానంలో మహార్యాలీకి సన్నాహాలు జరుగుతున్నాయని రాయ్ ప్రకటించారు. ఇందులో లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని, కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమికి చెందిన ప్రముఖ నేతలు తమ గళం వినిపిస్తారని రాయ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ఆప్, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం, సమాజ్ వాదీ పార్టీ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ కూటమిని ఏర్పాటు చేశాయి. కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అధికారులు అరెస్టు చేశారు. తదనంతరం ఢిల్లీ కోర్టు ద్వారా మార్చి 28 వరకు ఈడీ కస్టడీకి పంపారు. నిర్దిష్ట వ్యక్తులకు అనుకూలంగా మద్యం పాలసీని రూపొందించడానికి సంబంధించిన కుట్రలో ప్రత్యక్ష ప్రమేయం ఉన్నట్లు ఢిల్లీ సీఎం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవినీతిపరులను కాపాడేందుకు నిజాయతీపరులందరినీ లక్ష్యంగా చేసుకుంటోందని ఆందోళనకారుల్లో ఒకరైన సోమ్‌నాథ్ భారతి అన్నారు. రాఖీ బిర్లాతో పాటు తనను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని భారతి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన అనేక మంది వలంటీర్లు, కేజ్రీవాల్ జీ మద్దతుదారులతో పాటు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆప్ మద్దతుదారులను ఢిల్లీ పోలీసులు అకారణంగా అరెస్టు చేశారు' అని ఆమె పేర్కొన్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినందుకు ఢిల్లీ ప్రజలు బీజేపీపై ఆగ్రహంతో ఉన్నారని ఆప్ నేత దుర్గేష్ పాఠక్ అన్నారు. 'ఢిల్లీ, దేశ ప్రజలు బీజేపీపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఏకైక లక్ష్యంగా ఉన్న నాయకుడిని (అరవింద్ కేజ్రీవాల్) మోదీ జైలులో పెట్టారు. కేజ్రీవాల్‌ను మోదీ ద్వేషిస్తాడు. కేజ్రీవాల్‌కు భయపడుతున్నాడు' అని అన్నారు.

హర్యానాలో ఆప్ శ్రేణుల నిరసనలు

అంబాలా: కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా హర్యానాకు చెందిన అనేక ప్రాంతాల్లో ఆప్ కార్యకర్తలు నిరసన ధర్నాలు నిర్వహించారు. అంబాలా సిటీలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆప్ కార్యకర్తలు గుమిగూడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్నాల్, రోహ్‌తక్, ఫరీదాబాద్ సహా హర్యానాలోని ఇతర ప్రాంతాలలో కూడా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిరసనలు జరిగాయి. కేజ్రీవాల్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని ఆప్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుశీల్ గుప్తా అన్నారు. 'నియంతృత్వ మోదీ ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయాలని చూస్తోందని, అయితే నేడు దేశం మొత్తం నిజాయితీ గల నాయకుడు అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీకి అండగా నిలుస్తుంది' అని తెలిపారు.

అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాల నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాల నాయుడు ప్రస్తుతం మాడుగల సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆయనను రాబోయే ఎన్నికల్లో ఎంపీగా వైసీపీ ప్రమోట్ చేసింది. ఆయన స్థానంలో మాడుగుల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లి అనురాధను బరిలో దించనున్నారు. ఈమె బూడి ముత్యాల నాయుడు కుమార్తె. అనకాపల్లి లోక్‌సభ ఎంపీ ప్రకటనతో వైసీపీ మొత్తం 25 ఎంపీ స్థానాలకుగాను 25 స్థానాలను ప్రకటించినట్లయింది. ఇటీవల కడప జిల్లా ఇడుపులపాయలో 175 అసెంబ్లీ స్థానాలను, 24 ఎంపీ స్థానాలను సీఎం జగన్ ప్రకటించి, అనకాపల్లి ఎంపీ స్థానాన్ని పెండింగ్‌లో ఉంచారు. తాజాగా ఆ స్థానాన్ని ప్రకటించారు. అనకాపల్లి ఎంపీకి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా (బీజేపీ) సీఎం రమేశ్‌ను ప్రకటించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన రమేశ్‌ను ఇక్కడ బరిలో దించడంతో, అందుకు దీటుగా బూడి ముత్యాల నాయుడు పేరును వైసీపీ అధిష్టానం ఖరారు చేసింది.

నేడు ఢిల్లీ హైకోర్టులో అరెస్టుపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

శర్మ ముందు ఉదయం 10.30 గంటలకు పిటిషన్ విచారణకు జాబితా అయింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్‌ను మార్చి 21న అరెస్టు చేసి ఢిల్లీ కోర్టు మార్చి 28 వరకు ఈడీ కస్టడీకి పంపింది. కేజ్రీవాల్ తన పిటిషన్‌తో గత వారం హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు హోలీ సెలవు కారణంగా అత్యవసర విచారణ కోసం కేజ్రీవాల్ అభ్యర్థనను తిరస్కరించింది. ఈ కేసులో ఆప్ అగ్ర నేతలు మనీశ్ మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్లలో కేజ్రీవాల్ పేరు అనేక సార్లు ప్రస్తావనకు వచ్చింది. మద్యం పాలసీని రూపొందించినందుకు నిందితులు కేజ్రీవాల్‌తో సంప్రదింపులు జరిపారని, దాని ఫలితంగా తమకు అనవసరమైన ప్రయోజనాలు చేకూర్చాయని, దానికి ప్రతిఫలంగా వారు ఆప్‌కి ముడుపులు చెల్లించారని దర్యాప్తు సంస్థ పేర్కొంది.

పారదర్శక విచారణ అవసరం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన నివేదికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఈ కేసులో పారదర్శక విచారణను ప్రోత్సహిస్తున్నామని పేర్కొంది. కేజ్రీవాల్ అరెస్టుపై ఈ-మెయిల్‌లో అడిగిన ఓ ప్రశ్నకు యూఎస్ అధికార ప్రతినిధి బదులిస్తూ... సమయానుకూల, పారదర్శక న్యాయప్రక్రియ జరుగుతుందని ఆశిస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉంటే... ఈ అంశంపై ఇటీవల జర్మనీ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. భారత్ ప్రజాస్వామ్య దేశం. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ న్యాయపరమైన, నిష్పాక్షికమైన విచారణకు అర్హులు. అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను ఎలాంటి పరిమితులు లేకుండా ఆయన వినియోగించుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జర్మనీ స్పందనపై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని ఆ దేశ రాయబారికి సమన్లు పంపింది. దాంతో జర్మనీ ఎంబసీ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్ కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. ఆయన వద్ద భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని మండిపడింది.

యువత భవిష్యత్తుకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సంపదను దోచుకుతిన్నారన్నారు. కుప్పంలో నన్నే బెదిరించే స్థాయికి ఇక్కడ చోట నాయకులు వచ్చారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే డ్రగ్స్, గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తానన్నారు. వైసీపీ నేతలు ఆన్‌లైన్ మోసాలతో పేదల భూములను సైతం లాక్కుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షించే ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. జెండాలు మూడైన ఆ పార్టీల అజెండా ఒకటే అన్నారు. 20 లక్షల ఉద్యోగులతో పాటు నిరుద్యోగ యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వంపై యువత తిరుగుబాటు చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు మాట్లాడుతూ కుప్పంను ఐటీ హబ్‌గా, అలాగే ఇక్కడ చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానిక సమస్యలను చట్ట సభలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి చొరవ చూపి ఈ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, పార్టీ జిల్లా అధ్యక్షులు సి.ఆర్.రాజన్, నాయకులు మునిరత్నం, శ్రీనివాసులు, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

14 ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యం

చేవెళ్ల ముఖ్యనేతలతో సీఎం రేవంత్ సమీక్ష

విశాలాంధ్ర-హైదరాబాద్: క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతలతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలోనే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను ప్రకటించామనీ, మరలా అక్కడే ఏప్రిల్ ఆరు లేదా ఏడున జాతీయస్థాయి గ్యారెంటీలను ప్రకటించబోతున్నామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించబోతున్నట్టు వెల్లడించారు. ఈ జనజాతర సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖడ్గే హాజరవుతారని చెప్పారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో 14 స్థానాలు గెలవాలనే పట్టుదలతో ఉన్నామని, దానికి అనుగుణంగా ప్రతిఒక్కరు పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందన్నారు. అందుకే అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్ దానం నాగేందర్‌ను అభ్యర్థులుగా ప్రకటించినట్టు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు... మన వంద రోజుల పాలనకు రిఫరెండం అని పేర్కొన్నారు. 14 ఎంపీ స్థానాలు గెలిచి సోనియమ్మకు కృతజ్ఞత చెబుదామని పిలుపునిచ్చారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న మోదీ ఏం చేశారనే విషయం ప్రజల్లోకి తీసుకుపోవాలని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదు, వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురాలేదు, బుల్లెట్ ట్రైన్‌ను గుజరాత్‌కు తీసుకెళ్లిన మోదీ వికారాబాద్‌కు ఎంఎంటీఎస్ రైలు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకున్న మోదీ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. రీజనల్ రింగ్ రోడ్డు రాకుండా బీజేపీ మోకాలడ్డుతోందని, అలాంటపుడు ఏంచూసి మూడోసారి మోదీకి ఓటు వేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని నిలదీశారు. బీజేపీ నేతల వ్యవహారం... పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలన్నట్లుందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఇదే చక్కని అవకాశమని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని గుర్తుచేశారు. పార్టీకి అండగా నిలబడిన సోనియమ్మ నాయకత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

న్యాయశాస్త్రంతో ప్రజలకు ఉత్తమ సేవలు

సీజేఐ చంద్రచూడ్ ఉద్బోధ

విశాలాంధ్ర- తిరుపతి: న్యాయశాస్త్ర అధ్యయనం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించవచ్చని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. న్యాయ సేవలు సామాజిక బాధ్యత కావాలని న్యాయవాద పట్టభద్రులకు సూచించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగం నిర్వహించిన ఉత్సవాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ఈ ఉత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభిం చారు. 1982 మార్చి 12న తాను ఈ విశ్వవిద్యాలయానికి వచ్చానని జస్టిస్ చంద్రచూడ్ గుర్తుచేశారు. గతంలో న్యాయశాస్త్ర డిగ్రీని రెండవ డిగ్రీగా చేసేవారని, ఇప్పుడు న్యాయశాస్త్ర డిగ్రీని ఏకైక డిగ్రీగా ఎంచుకుని దక్షతతో పూర్తి చేస్తున్నారన్నారు. వైద్య, ఇంజనీరింగ్ విద్యపై విద్యార్థులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. సగానికి పైగా విద్యార్థినులు న్యాయశాస్త్ర విద్య చదవడం అభినంద నీయమన్నారు. తాము చదివే రోజుల్లో క్లాసుకు ఒకరిద్దరు అమ్మాయిలు మాత్రమే ఉండేవారన్నారు. భారతదేశంలో భిన్నభాషలు, భిన్న వస్త్రధారణలు, విభిన్న ఆహారపుటలవాట్లు ఉన్నప్పటికీ అందరిలో భారతీయతా ఉట్టిపడుతోందన్నారు. దేశీయ భావన ఒక్కటిగానే ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంటే కుటుంబానికి పెద్దగా అర్థం చేసుకోవాలని, కొలీజియంలో వివిధ రాష్ట్రాల, వివిధ న్యాయశాస్త్ర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయమూర్తులతో వ్యవస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. తాము కాఫీ తాగే సమయంలోనూ బాధ్యతాయుతంగా ఉంటామని చెప్పారు. తనకు న్యాయవిద్య నేర్పించిన గురువుల మేధస్సు అసాధారణమైనదని, వారు అపార జ్ఞానాన్ని తనకు పంచడం వల్ల తాను ప్రధాన న్యాయమూర్తి స్థాయిలో ఉన్నానని వివరించారు. విద్యార్థులకు గురువుల విశిష్టతను వివరించారు. ప్లేటో ప్రతిపాదిత విషయాలను గుర్తు చేశారు. నేషనల్ లా యూనివర్సిటీలలో చదివినవారు మాత్రమే గొప్పగా రాణిస్తారని అనుకోవడం నిజం కాదని, శ్రీ వేంకటే శ్వర విశ్వవిద్యాలయంలో చదివినా న్యాయాన్ని సమాజానికి అందించవచ్చునని సోదాహరణతో వివరించారు. యస్వీ యూ వైస్‌చాన్సలర్ ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో స్థాపించిన ఈ విశ్వ విద్యాలయం 70 ఏళ్ల పయనంలో ఎన్నో మైలురాళ్లు అధిగ మించిందన్నారు. నేడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో రెండవ స్థానంలో నిలిచిందని తెలిపారు. యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో నూతన కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. యస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం, ఐదు సంవత్సరాల న్యాయశాస్త్ర కోర్సు డీన్ ఆచార్య వీఆర్సీ కృష్ణయ్య లా కోర్సు విధి విధానాల గురించి తెలియజేశారు. సభకు గౌరవ హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయాధికారులు వచ్చారు. యస్వీయూలోని ఐదు సంవత్సరాల న్యాయశాస్త్ర విభాగ విద్యార్థులు, న్యాయశాస్త్ర అధ్యాపకులు, జిల్లాలోని వివిధ న్యాయశాస్త్ర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించండి

పౌర సరఫరాల కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని, రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద బాధిత రైతులతో కలసి సంఘం నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్. అరుణ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి సుమారు రూ.900 కోట్లమేర ధాన్యం బకాయిలు రాకపోవ డంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సాగు పెట్టుబడులు తిరిగి చెల్లించేందుకు అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. రుణాలకు వడ్డీలు చెల్లించేందుకు నానా ఇక్కట్లుకు గురౌతున్నట్టు తెలిపారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జములయ్య మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పార్వతీపురం, మన్యం తదితర జిల్లాల్లో ధాన్యం బకాయిలు రాకపోవడంతో కౌలు రైతులు ఇబ్బందులకు గురవు తున్నారని చెప్పారు. కౌలు చెల్లించడంతోపాటు రబీ పంటలకు పెట్టుబడికి అవసరమైన డబ్బులు అందక సతమతమౌతున్నారని వివరించారు. రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం బకాయలు చెల్లింపులో జాప్యం చేయడం శోచనీయమన్నారు.

తొలుత కమిషనర్ స్పందిస్తూ...తక్షణమే రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుసంఘం కృష్ణా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముక్కామల ఉమామహేశ్వరరావు, గుత్తికొండ రాము, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వెలగపూడి ఆజాద్, అడ్డాడ ప్రసాద్, మున్నంగి నరసింహారావు, వేమూరి రత్నగిరి, గుమ్మడి వెంకటరత్నం, పెయ్యల నాగరాజు, బోగేశ్వరరావు, చెరుకూరి యుగంధర్ పాల్గొన్నారు.

ఆర్థికశాఖ కార్యదర్శి, ఓఎస్డీలపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి అచ్చెన్నాయుడు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్థిక శాఖలో పారదర్శకత కోసం తెచ్చిన సీఎఫ్ఎంఎస్ వ్యవస్థను నాశనం చేస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఓఎస్డీ ధనుంజయ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక శాఖ అధ్వర్యంలో ఉండాల్సిన సీఎఫ్ఎంఎస్‌ను ముఖ్యమంత్రి కార్యాలయం ఆధీనంలోకి తీసుకుంది. సత్యనారాయణ, ధనుంజయ్ రెడ్డి కలిసి నిధులు దారి మళ్లిస్తున్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీకి మద్దతుగా నిలిచే కాంట్రాక్టర్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం కార్యాలయం నుంచే అనేక చెల్లింపులు జరుగుతున్నాయి. వెంటనే ప్రత్యేక స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి ఈ అక్రమాలపై విచారణ జరిపించాలి. సత్యనారాయణ, ధనుంజయ్‌రెడ్డిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఇంకా ముఖ్యమంత్రి ట్విట్టర్ హ్యాండిల్లో జగన్ ఫొటో ఉండటం, సంక్షేమ పథకాలపై సమాచారం తొలగించకపోవడంపై అచ్చెన్నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంకు సంబంధించి అన్ని ఫోటోలు, సంక్షేమ పథకాల సమాచారం ప్రభుత్వ ట్విట్టర్ హ్యాండిల్ నుండి తొలగించాలని, ఎన్నికల కోడ్‌ను విస్మరించినందుకు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో బోల్తా... ఇద్దరు కూలీల దుర్మరణం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: అదుపుతప్పి ఆటో బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లా చిన ఆగిరిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్ల గూడెంకు చెందిన మహిళా కూలీలు, కూలి పనులకు వీరపనేనిగూడెం ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న మోటార్ బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయా ణిస్తున్న ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్‌తో సహా మిగిలిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను స్థానికులు ఆవుటపల్లిలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. టీడీపీ నూజివీడు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి కె.పార్థసారథి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యకళాశాల సూపరింటెండెంట్‌ను కలిసి గాయపడినవారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులకు ధైర్యం చెప్పి టీడీపీ అండగా ఉంటుందని పార్థసారథి హామీ ఇచ్చారు.

వీఐటీలో జాతీయస్థాయి వ్యాపార ప్రణాళిక పోటీ

విజేతలకు రూ.3 లక్షల విలువైన బహుమతులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వీఐటీ విశ్వ విద్యాలయంలో జాతీయస్థాయి వ్యాపార ప్రణాళిక పోటీ (వి లాంచ్ పాడ్-2024) గ్రాండ్ ఫైనల్ అవార్డు వేడుకను మంగళవారం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ సంయుక్త సహకారంతో ఘనంగా నిర్వహించారు. వి-లాంచ్ పాడ్ 2024లో దేశవ్యాప్తంగా ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలు సహా 72 విశ్వవిద్యాలయాలకు చెందిన 650 జట్లు పాల్గొన్నాయి. ఇన్నోవేషన్ ఇన్ టెక్నాలజీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్‌కేర్ అండ్ అగ్రికల్చరల్ అడ్వాన్స్‌మెంట్‌లు, డిజిటల్- ఎన్విరాన్‌మెంటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే ప్రధాన అంశాలలో ఈ వ్యాపార ప్రణాళిక పోటీ జరిగింది. విజేతలుగా నిలిచిన జట్టులకు రూ.3 లక్షల విలువైన బహుమతులు అందించారు. గ్రాండ్ ఫినాలేలో ట్రిపుల్ ఐటీ- ఢిల్లీ, ఐఐటీ - ఖరగ్‌పూర్, రేవా యూనివర్సిటీ, వీఐటీ-వెల్లూర్, ఏపీ జట్లు, ఆర్వీఆర్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బెంగళూరు, అదానీ యూనివర్సిటీ అహ్మదాబాద్, కర్పగం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కోయంబత్తూర్ తమ ట్రాక్‌లలో విజేతలుగా నిలిచాయి. దేశాభివృద్ధికి ఉద్దేశించబడిన సృజనాత్మకత, వ్యవస్థాపకత, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో వికసిత్ భారత్ ఏ 2047 అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్‌ను ప్రోత్సహిం చడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, సాంకేతికంగా విశ్వవిద్యాలయం అందిస్తున్న మద్దతును, పేటెంట్ ప్రచురణలు, పరిశోధన ర్యాంకింగ్‌లలో విశ్వవిద్యాలయం సాధించిన విజయాల గురించి తెలిపారు. వీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల ప్రయా ణంలో ఆవిష్కరణల ఆవశ్యకతను తెలియజేస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వైఫల్యాలతో నిరుత్సాహపడకుండా వాటి నుండి నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఐఈ ప్రెసిడెంట్ ఈశ్వరపు రవి, వాద్వాని ఫౌండేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సుజాత, వీటీఈ టీబీఐ, ఐఐఈసీ డైరెక్టర్లు డాక్టర్ ఎ.బాలచంద్రన్, అమిత్ చవాన్, వి లాంచ్ పాడ్ కన్వీనర్ డాక్టర్ ఉషా శేషాద్రి, అరుణ్‌కుమార్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ అరుణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

తొత్తుల్ని... పొత్తుల్ని ఓడించండి: శ్రీనివాసరావు

విశాలాంధ్ర- భీమవరం: విభజన అనంతరం రాష్ట్రాన్ని రాహు కేతువుల్లా చంద్రబాబు, జగన్ సర్వనాశనం చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ-బీజేపీ పొత్తులో ఉందని, వైసీపీ బీజేపీకి తొత్తుగా ఉందని విమర్శించారు. తొత్తుల్ని, పొత్తుల్ని ఓడిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విభజన తరువాత రాష్ట్రం వెనుకబడిపోవడానికి టీడీపీ, బీజేపీలే కారణమని ధ్వజమెత్తారు. పదేళ్లలో ఎటువంటి పరిశ్రమలు రాకపోగా, వాటి పేరుతో రైతుల నుంచి 2.50 లక్షల ఎకరాల పచ్చటి పొలాల్ని లాగేసుకున్నారని దుయ్యబట్టారు. అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలను సాగనంపాలని పిలుపునిచ్చారు. బ్రెజిల్ నుంచి విశాఖ రేవుకు 50 వేల కోట్ల విలువచేసే డ్రగ్స్ చేరగా... టీడీపీ-వైసీపీ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని అన్నారు. వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఓటర్లకు ఒక్కరూపాయి పంచకుండా, ప్రలోబాలకు గురిచేయకుండా గెలిచి చూపించాలన్నారు.

ఇండియా కూటమిలో ఉన్న పార్టీలతో రాష్ట్రంలో సీపీఎం, సీపీఐ కొన్ని సీట్లు సర్దుబాటు చేసుకున్నాయని, కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. జాతీయస్థాయిలో బీజేపీని ఎదుర్కోగల శక్తి ఒక్క ఇండిగా కూటమికి మాత్రమే ఉందన్నారు. సీపీఎం బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీరు కొరతలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఆక్వాకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం, జె.ఎన్.వి.గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

సమాజానికి కమ్యూనిస్టులు అవశ్యం

బీజేపీ అభ్యర్థులు గెలవకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలి

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం: ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల అవసరం సమాజానికి అనివార్యమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అడుగుపెట్టకుండా నిలువరించే సత్తా కమ్యూనిస్టులకే ఉందన్నారు. సిట్టింగ్ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు గెలవకుండా ప్రజలను చైతన్య వంతం చేసి ఆ పార్టీని నిలువరించాలన్నారు. కొత్తగూడెం నియోజక వర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం పాల్వంచ చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా కూనంనేని నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, మోదీ పాలన దేశాన్ని ఫాసిజం వైపు నెట్టేసిందన్నారు. ప్రజల సంపదగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను తమకు అనుకూల కార్పొరేట్ శక్తులకు టోకుగా కట్టబెట్టడంతోనే మోదీ వ్యూహాలు చైతన్యవంతులకు అర్థమయ్యాయని తెలిపారు. మోదీ ఈ పదేళ్ల పాలనలో ఒక లక్ష్యం ప్రకారం వ్యవస్థీకృత దోపిడీ చేస్తూ వచ్చారని విమర్శించారు. సోదర భావంతో సమైక్యంగా ఉన్న దేశ ప్రజలను కులాలు, మతాలుగా విభజించి మైనారిటీ వర్గాలను లక్ష్యం చేస్తూ ఒక ఎత్తుగడతో చిచ్చుపెడుతూ దేశాన్ని వ్యూహాత్మకంగా ఆక్రమించారని విమర్శించారు. బీజేపీలో అన్ని రకాలుగా ఆధిక్యం చాటుతున్న గుజరాత్ లాబీ పన్నాగాలను దేశ ప్రజలు, ముఖ్యంగా తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారని, వారిని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు ఘోరంగా పెరిగిపోతున్నాయన్నారు. 10 శాతం కోటీశ్వరుల చేతిలో దేశ సంపద సగంపైగా ఉందన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత సీపీఐ కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. మోదీ పాలనలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ అనుకూల ఎన్‌డీఏ ప్రభుత్వాలకు దేశ సంపదను టోకుగా దోచిపెడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగ పరమైన పాలన సాగాలని, బీజేపీ సొంత అజెండాను ప్రజలపై రుద్ది పరిపాలిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. దేశంలో ధరలు, ఆర్థిక వ్యవస్థను మోదీ వచ్చాక చిన్నాభిన్నం చేశాడని విమర్శించారు. ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో బీజేపీయేతర అభ్యర్థులదే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు డి.శేషయ్య, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అడ్డుమల్లి సాయిబాబా, వాసిరెడ్డి మురళి, జి.వీరస్వామి, భూక్యా దసురు, వట్టికొండ మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, జి.నగేష్, వి.కొండల రావు, కంచర్ల జమలయ్య, లక్ష్మీపతి, కుమారి హనుమంతరావు, రాములు, భూక్యా శ్రీను, మునిగడప వెంకటేశ్వర్లు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

మిజోరం గవర్నర్ హరిబాబు

విశాలాంధ్ర-భీమవరం: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల 44వ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాద్‌రాజు అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిబాబు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి ధీటుగా ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. సమాచార విప్లవం వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇతర దేశాలపై ఆధారపడకుండా విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలతో ముందుకురావాలని సూచించారు. కొత్త ఆలోచనలతో నూతన పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కోరారు. ప్రసాదరాజు, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలను 1980లో ప్రారంభించామనీ, 44 సంవత్సరాల్లో దేశంలోని అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా గుర్తింపు పొందిందని వివరించారు. ఈ సందర్భంగా హరిబాబు చేతుల మీదుగా కళాశాల వ్యవస్థాపకుడు దివంగత సాగి రామకృష్ణంరాజు పేరిట పోస్టల్ ప్రత్యేక కవరు విడుదల చేశారు. కళాశాల గౌరవ చైర్మన్ పి.కృష్ణంరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, ఎస్వీ రంగరాజు, పాలకవర్గ సభ్యుడు డాక్టర్ కేవీస్ విజయ నరసింహరాజు, వెం టెక్నాలజీస్ సీఈవో వి.వెంకటరాజు పాల్గొన్నారు.

ఎ.కొండూరులో కిడ్నీ బాధితుడి మృతి

విశాలాంధ్ర-ఎ.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు దళితవాడకు చెందిన బొబ్బలపాటి రామస్వామి (బాబురావు- 54) కిడ్నీ వ్యాధితో సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రామస్వామి లారీ డ్రైవర్‌గా పనిస్తున్నాడు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా కిడ్నీ వ్యాధి మహమ్మరితో పోరాడి మృత్యువాత పడ్డాడు.

సీపీఐ నాయకుల పరామర్శ: రామస్వామి కుటుంబసభ్యులను సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ మంగళవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం డేవిడ్ మాట్లాడుతూ మండలంలో వందలాది మంది కిడ్నీ బాధితులు మరణించారని, అయినా ప్రభుత్వంలో చలనం రావడం లేదని విమర్శించారు. కిడ్నీ వ్యాధితో మరణించిన రామస్వామి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా, 2.5 ఎకరాల సాగుభూమితో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

బాలలను భాగస్వామ్యం చేయొద్దు

రాజకీయ పార్టీలకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో 18 సంవత్స రాల లోపు బాలలను ఎటువంటి ప్రచార కార్యక్రమాల్లోనూ భాగస్వాములను చేయొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొందు శీతారామ్, జంగం రాజేంద్రప్రసాద్, త్రిపర్ణ ఆదిలక్ష్మి అన్ని రాజకీయపార్టీలను కోరారు. అభ్యర్థుల ప్రచారానికి గానీ, ప్రచార మాధ్యమాల్లో గానీ, రాజకీయ పార్టీల సామగ్రి సరఫరా, పంపిణీ కార్యక్రమాలో భాగస్వామ్యం చేయొద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం బాలలను ఎన్నికల్లో భాగస్వామ్యం చేస్తే ఆయా రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకుం టామని ఆదేశించడంతో పాటు మార్గదర్శకాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. గతకొద్ది రోజులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, కొన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ప్రచారాలకు బాలలను వినియో గిస్తున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. బాలల మనస్సు, వారి ఆలోచన విధానం చాలా సున్ని తంగా ఉంటుందని, వారి పసి హృదయాల్లో ఎన్నికలు, రాజకీయాలకు సంబంధించిన సంఘ టనలు, కార్యకలాపాలు వంటివి చొర బడకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు, ఇటువంటి అంశాలపై తాము డేగ కళ్లతో పరిశీలిస్తామని, అందువల్ల కచ్చితంగా ఈ సూచనలను రాజకీయ పార్టీలు పాటించాలని కోరారు.

వైసీపీని గద్దె దించేందుకే కూటమి

దగ్గుబాటి పురందేశ్వరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అవినీతి, అరాచకాలకు పేరుగాంచిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెం దింపేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ముఖ్య పదాధికారుల సమావేశం జరిగింది. బీజేపీ జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి అరుణ్ సింగ్, ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి సుజనా చౌదరి, సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీతో కలిసి వెళ్లాలని జాతీయ స్థాయిలో పార్టీ తీసుకున్న నిర్ణయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు పార్టీల కలయిక చారిత్రక అవసరమని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును ఆమె త్రివేణి సంగమంతో పోల్చారు. పొత్తుల వల్ల పార్టీలో చాలామంది ఆశావహులకు నిరాశ ఎదురైంది. కానీ రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొత్తులతో వెళ్లాలని పార్టీ అధిష్ఠానం భావించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను తమ చేతుల్లోకి తీసుకుందని ఆమె ఆరోపించారు. ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని, మరోవైపు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఊబిలో దించారని ఆరోపించారు. రాష్ట్ర సచివాలయం సహా గనులను, ప్రభుత్వ భవనాలను, భూములను ప్రభుత్వం తనఖా పెట్టిందన్నారు. సచివాలయాన్ని తాకట్టు పెట్టకూడదని రాజ్యాంగంలో ఏమైనా రాశారా అని ఓ వైసీపీ నేత చేసిన వ్యాఖ్యలు వారి పరిపాలనా దక్షతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టే అధికారం ఈ ప్రభుత్వానికి ఎక్కడిదని ఆమె ప్రశ్నించారు. మహిళల పుస్తెలు తెగినా నాసిరకం మద్యం తాగిస్తామనే రీతిలోనే సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని పురందేశ్వరి మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నిధులన్నీ సంక్షేమ పథకాలకు దారి మళ్లించారన్నారు.

సంపాదకీయం

ఐరాస ఆదేశాన్ని పట్టించుకోని ఇజ్రాయిల్

దాదాపు ఆరు నెలలుగా ఇజ్రాయిల్ పలస్తీనా మీద, ముఖ్యంగా గాజా మీద కర్కోటకమైన యుద్ధం కొనసాగిస్తోంది. సోమవారం ఐక్యరాజ్య సమితి భద్రతా సమితి ఎట్టకేలకు రంజాన్ సందర్భంగా కాల్పుల విరమణ ప్రకటించాలని ఇజ్రాయిల్‌ను నిర్దేశిస్తూ తీర్మానం ఆమోదించగలిగింది. అమెరికా ఈ తీర్మానంపై ఓటింగుకు గైరుహాజరైనందువల్ల తీర్మానం ఆమోదించడం సాధ్యమైంది. ప్రపంచ శాంతిని కాపాడి, యుద్ధాలు నివారించవలసిన బాధ్యత ఉన్న ఐక్యరాజ్యసమితి ఇజ్రాయిలీ తీవ్రవాద చర్యలను నిరోధించడంలో విఫలమైంది. రంజాన్ పవిత్ర మాసం గనక ఇంకా ఈ నెలలో మూడు వారాలకన్నా తక్కువ కాలంలో మాత్రమే కాల్పుల విరమణ పాటించాలని తీర్మానించడం విచిత్రం. అయితే భద్రతా సమితి ఈ ఒక్క అడుగైనా వేయగలిగింది. బందీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని కూడా కోరింది. గత ఏడాది అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయిల్ మీద రాకెట్లతో దాడి చేసిన మర్నాడే హమాస్‌ను అంతమొందించేదాకా నిద్రపోనని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ గర్జించారు. అప్పటి నుంచి గాజా నది పశ్చిమ తీరం నుంచి పలస్తీనియన్లు చాలా మంది గాజా చేరుకున్నారు. ఆ తరవాత ఇజ్రాయిల్ గాజాను సర్వనాశనం చేయడానికి సకలవిధ ప్రయత్నాలూ చేస్తోంది. హమాస్ ఇజ్రాయిల్ మీద దాడి చేసినప్పుడు 12,000 మంది మరణించిన మాట నిజమే. కానీ ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద బాహాటంగా యుద్ధమే ప్రకటించింది. ఈ యుద్ధంలో ఇంతవరకు 32,000 మంది పలస్తీనియన్లు నేలకొరిగారు. 17 లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజా నగరం శ్మశానం కన్నా ఘోరంగా తయారైంది. నెతన్యాహు రక్త దాహాన్ని అమెరికా మొదటి నుంచి బాహాటంగానే సమర్థిస్తోంది. కాల్పులు విరమించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీర్మానం ప్రతిపాదించినప్పుడల్లా అమెరికా వీటో అస్త్రం ఉపయోగించి మోకాలడ్డుతూనే ఉంది. 15 సభ్య దేశాలున్న భద్రతా మండలి యుద్ధం ప్రారంభం అయినప్పటి నుంచి నాలుగుసార్లు కాల్పుల విరమణకోసం ప్రయత్నించి విఫలం అయింది. గత శుక్రవారం అమెరికా తనకు అనుకూలమైన రీతిలో కాల్పుల విరమణకోసం తీర్మానం ప్రతిపాదించినప్పుడు భద్రతా సమితిలో శాశ్వత సభ్యత్వం ఉన్న రష్యా, చైనా దేశాలు అమెరికా కుటిల యత్నాలను సాగనివ్వకుండా వీటో చేశాయి. ఇంతకు ముందు తీర్మానాలను ఆమోదించడానికి వీలు లేకుండా అమెరికా మూడుసార్లు వీటో అవకాశాన్ని ఉపయోగించుకుంది. ఈ సారి అమెరికా గైరుహాజరైనందువల్ల కనీసం రంజాన్ పండగ ముగిసే దాకా అయినా కాల్పుల విరమణ పాటించాలని ఇజ్రాయిల్‌ను నిర్దేశిస్తూ తీర్మానం ఆమోదించగలిగారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ పశ్చిమాసియా ప్రాంతంలో ఇటీవలే పర్యటించారు. గాజా, ఈజిప్టు సరిహద్దులోని రఫాలో మానవతావాద దృష్టితో తక్షణం కాల్పుల విరమణ పాటించాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న ఈ కాల్పుల విరమణ తీర్మానాన్ని అమలు చేయాలని గుటెరెస్ గట్టిగా కోరారు. ఈ తీర్మానాన్ని అమలు చేయించలేకపోతే అది క్షమించరాని తప్పిదం అవుతుందని కూడా ఆయన అన్నారు.

భద్రతా సమితి తీర్మానం మీద వోటు వేయకుండా గైరుహాజరైన అమెరికాను మినహాయిస్తే మిగిలిన 14 దేశాలు తీర్మానాన్ని సమర్థించాయి. అయితే భద్రతా సమితి తీర్మానం రంజాన్ పండగదాకానే కాల్పుల విరమణ జరగాలని కోరడం ఐక్య రాజ్య సమితి బలహీనతనే నిరూపిస్తోంది. యుద్ధ రంగంలో చిక్కుకున్న వారికి వైద్య సేవలు అందించడంతో సహా ఇతర మార్గాల్లో మానవతావాద దృష్టితో సహాయాన్ని అందించడానికి కూడా ఇజ్రాయిల్ అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోంది. యుద్ధ సమయంలో పౌరుల మీద దాడి చేయడాన్ని కూడా భద్రతా సమితి ఖండించింది. కానీ గత అయిదు నెలలపై నుంచి ఇజ్రాయిల్ ఒక తీవ్రవాద దేశంగా వ్యవహరిస్తూ పలస్తీనియన్లందరినీ తుడిచి పెట్టాలని కసిగా ప్రయత్నిస్తోంది. ఈజిప్టు, ఖతార్ లాంటి దేశాల శాంతి యత్నాలను కూడా ఇజ్రాయిల్ వ్యతిరేకిస్తూనే ఉంది. నెతన్యాహూ ఇంత మంకుపట్టు పట్టడానికి పలస్తీనియన్లంటే ముందు నుంచి ఉన్న ద్వేష భావం ఒక కారణం కావచ్చు. అంతకు మించి ఆయుధ వ్యాపారంతో కడుపు నింపుకునే అమెరికా మద్దతు ఇజ్రాయిల్‌కు ఉంది. నెతన్యాహూ అమానుష యుద్ధ కాండను నిలిపివేయించడానికి అమెరికా ప్రయత్నించిన దాఖలాలే లేవు. అమెరికా చరిత్రలో ఆ దేశం ఇంతవరకు తన గడ్డ మీద ఒక్కసారి కూడా యుద్ధం చేయలేదు. కానీ ప్రపంచంలో ఏ మూల యుద్ధం జరిగినా యుద్ధోన్మాదుల పక్షాననే నిలబడుతుంది. యుద్ధాలను సమర్థించడం ద్వారా ఆయుధ వ్యాపారం కొనసాగించడానికే అమెరికా ప్రాధాన్యం ఇస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ప్రపంచంలో జరిగిన అన్ని యుద్ధాలలో అమెరికా ఈ దుష్ట పాత్రే పోషిస్తోంది. తీవ్రవాదాన్ని మట్టుబెట్టడానికి ఏ అవకాశమూ వదలం అని చెప్పుకునే అమెరికా ప్రపంచంలోకెల్లా ఒకే ఒక తీవ్రవాద దేశం అయినా ఇజ్రాయిల్‌కు అండగా నిలవడాన్ని మించిన దుర్నీతి ఏదీ ఉండదు. మొజాంబిక్ ఈ తీర్మాన ముసాయిదా సిద్ధం చేసింది. గాజా నది తీరంలో జరుగుతున్న మారణకాండ ఇక ఎంత మాత్రం కొనసాగనివ్వకూడదని మొజాంబిక్ వాదించింది. యుద్ధం మొదలైన నాటి నుంచి అమెరికా కాల్పుల విరమణ అన్న ప్రస్తావననే వ్యతిరేకిస్తూ వచ్చింది. తనకు మిత్ర దేశమైన ఇజ్రాయిల్ రక్త పిపాస తీర్చడానికి ఆయుధాలు సరఫరా చేస్తూనే ఉంది. అమెరికా అండ నిండుగా ఉన్న నెతన్యాహూ యుద్ధంలో చిక్కుకున్న వారికి ఆహారమైనా అందకుండా చేసి పలస్తీనియన్లను ఆకలికి మాడ్చి చంపాలనుకుంటున్నాడు. భద్రతా మండలిలో ప్రతిపాదించే తీర్మానాన్ని వీటో చేయకపోతే అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాలని ఈ తీర్మానం ప్రతిపాదించక ముందే నిర్ణయించుకున్నారు. అయితే అమెరికా ఈ సారి వీటో చేయకుండా గైరుహాజరైంది కనకే తీర్మానం ఆమోదించడం సాధ్యమైంది. గాజా నది తీరంలో మారణహోమం కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ అధినేత నెతన్యాహూ ఐక్య రాజ్య సమితి తీర్మానాన్ని ఏ మేరకు అమలుకు చేస్తారో ఇప్పటికైతే తెలియదు. ఇజ్రాయిల్ పలస్తీనా భూభాగాల మీద బాంబుల వర్షం కురిపించడం, రోజూ వందలాది మందిని బలిగొనడంతో ఆగడం లేదు. కనీసం 70,000 మంది పలస్తీనియన్లు ఈ అమానుష దాడిలో గాయపడ్డారు. రోజూ పలస్తీనియన్లను ఇజ్రాయిలీ బలగాలు అరెస్టు చేస్తూనే ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి భద్రతా సమితి తీర్మానం ఆమోదించి ఒక రోజు గడిచిన తరవాత కూడా యుద్ధ రంగంలో పరిస్థితి మారిన దాఖలాలైతే లేవు.

డిజిటల్ యుగంలో చిన్నబోతున్న రంగస్థలం !

1961లో అంతర్జాతీయ రంగస్థల సంస్థ (ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్, ఐటిఐ) చొరవతో రంగస్థల ప్రాధాన్యం, సమాజ పరివర్తనంలో ప్రత్యక్ష పాత్రను నిర్వహించడం లాంటి లక్ష్యాలతో ఏటా మార్చి27న ప్రపంచ దేశాలు "ప్రపంచ రంగస్థల దినోత్సవం (వరల్డ్ థియేటర్ దే)"ను పాటించటం ఆనవాయితీగా మారింది. ప్రపంచ రంగస్థల దినం-2024 నినాదంగా "థియేటర్ అండ్ ఏ కల్చర్ ఆఫ్ పీస్" అనే అంశాన్ని ఎంపిక చేశారు. నాటకం సార్వజనీయం, సర్వకాలీనం. ప్రాచీన కళల్లో బహుళ ప్రజాధరణ పొందిన నాటకం ప్రముఖమైంది. మన ముందున్న అనేక కళల్లో జీవితాన్ని వాస్తవంగా చూడడానికి, మానసికో ల్లాసానికి రంగస్థలం ఉపయుక్తం అవుతున్నది. నేటి డిజిటల్ యుగపు వినోద విజ్ఞాన మాధ్యమాలుగా సినిమాలు, స్మార్ట్‌ఫోన్లు, గూగుల్ మాధ్యమాలు, అంతర్జాల తెరలు, ఓటీటీ వేదికల వరదల్లో నాటకరంగం కొట్టుమిట్టాడుతున్నది. రంగస్థల నాటకాలు, వీధి నాటకాలు, నాటికలు అనాదిగా మానవాళికి వినోద విజ్ఞాన వితరణ కేంద్రాలుగా సేవలు అందించడం మన గత అనుభవంగా మది పొరల్లో మధుర జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. నేడు రంగస్థలం ఆదరణ కరువై అనాథగా మారి అంతరించే దుస్థితికి చేరడం అత్యంత విచారకరం.

రంగస్థల పోషకులుగా నటులు, దర్శకులు, రచయితలు, సంగీతకారులు, గాయకులు, డిజైనర్లు, శబ్ద నిర్మాతలు, లైటింగ్/స్టేజ్/వేషధారణ నిపుణులు నాటకాన్ని సజీవ రూపంగా మార్చడానికి కృషి చేయడం మనకు తెలుసు. ఒక నాడు ఒక మహా ఉద్యమ చరిత్రగా వెలిగిన రంగస్థలం ఆధునిక పోకడలతో రోజు రోజుకు నిరాదరణకు గురవుతున్నది. గొప్ప చరిత్ర కలిగిన రంగస్థల దినం సందర్భంగా థియేటర్ నిపుణులు, ఔత్సాహికులు, నిర్వహణ సంస్థలు నేడు కూడా అవిరళ కృషి చేస్తున్నారు. భాష, సంస్కృతి, సరిహద్దులకు అతీతంగా రంగస్థల రూపాలు ప్రజలకు విశేష వినోదాన్ని, స్ఫూర్తిని కలిగిస్తూనే ఉన్నాయి. ప్రపంచ రంగస్థల దినం వేదికగా నాటకాలు, నాటికలు, వీధి, లఘు నాటికలు ప్రదర్శించడంతో పాటు నాటక రంగ సుప్రసిద్ధ నిపుణుల సేవలకు పురస్కారాలు, నాటకాలను చూడడం, ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, నటులకు చేయూత ఇవ్వడం, థియేటర్ ఫెస్టివల్స్ నిర్వహించడం, నాటక రంగాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం లాంటివి నిస్వార్థంగా కొనసాగాలి. రంగస్థల శక్తిని గ్రహించి విద్యాలయాలు, యూనివర్సిటీలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు, పౌర సమాజం తగు చర్యలను తీసుకొని మనకబారిన నాటకంపై వెలుగులు విరజిమ్మాలి. నాటకం ప్రజలను ఏకం చేస్తుంది. రంగస్థలం సమాజాన్ని జాగృత పరుస్తుంది. సమాజ అవలక్షణాలను విమర్శిస్తూనే విరుగుడు మంత్రాన్ని బోధిస్తుంది. నాటకం ఓ వాస్తవ దృశ్య శ్రవణ రూపం. పరస్పర అవగాహన, సాంస్కృతిక వైవిధ్య ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతుంది. రంగస్థలం ఉచిత నడవిజ్ఞాన వితరణ కేంద్రం. ప్రపంచ మానవాళి జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటకరంగ కళ నేడు నిరాదరణ వరదలో కొట్టుకుపో తున్నది. నాటకరంగంలో వెలిగిన ప్రముఖ నటులు వెండితెర స్టార్లుగా వెలుగులు చిమ్ముతున్నారు. నాటకం నుంచే సినిమా పుట్టింది. ఇప్పటికీ రంగస్థల నటులు సినిమా రంగంలో రాణిస్తూనే ఉన్నారు. ఏఎన్ఆర్, ఎన్టీఆర్, నాగయ్య, ఎస్వీ రంగారావు, కోట బ్రదర్స్, జయప్రకాశ్ రెడ్డి, విజయ్ దేవరకొండ/ నవీన్ పోలిశెట్టి, సందీప్ మాధవ్ లాంటి ఎందరో మన తెలుగు నటులు టాలీవుడ్‌ను సుసంపన్నం చేసిన విషయం మనకు తెలుసు. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ ప్రపంచ శాంతికి ఊతం ఇస్తున్న రంగస్థలం పునర్వైభవం పొందడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. నాటకాన్ని మన జీవితాల్లో భాగం చేసుకోవాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

వనరుల రక్షణకు లడఖ్‌లో ఉద్యమం

డా. సోమ మర్ల

సోనమ్ వాంగ్‌చుక్ అమీర్ ఖాన్ చిత్రం త్రీ ఇడియట్స్ నుంచి అందరికీ సుపరిచితం. చిత్రం రెండో దశ అమీర్ ఖాన్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తితో రూపొందింది. ఆయన ప్రఖ్యాత విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త, అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డుల విజేత. లడఖ్‌లో సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న నిరాహార దీక్ష ఆదివారం 18వ రోజుకు చేరుకుంది. 300 మందికి పైగా ప్రజలు బహిరంగ ప్రదేశంలో మైనస్ 10డిగ్రీల సెల్సియస్ వద్ద ఆయనకి మద్దతు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యమంలో ముందంజలో సోనమ్ వాంగ్‌చుక్ ఉన్నారు. హిమాలయ ప్రాంతంలోని నలుమూలల్లో ఆయన చేపట్టిన ఉద్యమంలో వేలాది మంది ప్రజలు చేరుతున్నారు. పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీతో 2019 ఆగస్టు 5 న జమ్ము కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఈ సమస్య తలెత్తింది. లేహ్-లడఖ్ జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో భాగంగా ఉండేది. అది కాశ్మీరీలను అత్యంత కలవరపరిచింది. అయితే సుందర దృశ్యాలను కలిగి ఉన్న హిమాలయ ప్రాంతాలలోని ఖనిజాలతో నిండిన భూములను ఆక్రమించాలనే విభజించి పాలించు దుర్మార్గపు ప్రణాళిక గురించి వారికి తెలియదు. దీని వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, కార్పొరేట్లకు చాలా చౌక ధరలకు భారీ భూములను ఇవ్వడం, బహుళజాతి దిగ్గజాలకు స్వేచ్ఛనివ్వడం. కానీ దేశంలోని కార్పొరేట్ మీడియా అటువంటి సమరశీల ఉద్యమాన్ని హైలైట్ చేయడం అవసరమని భావించలేదు. ఈ ప్రాంతంలో దాదాపు 3 లక్షల మంది నివసిస్తున్నారు. 30,000 మందికి పైగా ప్రజలు తమ డిమాండ్లను లేవనెత్తడానికి ఫిబ్రవరి 3న గుమిగూడారు, అంటే ఈ ప్రాంతంలోని పది శాతం జనాభా ఒకే చోట గుమిగూడారు.

లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా రూపొందించడం మొదట్లో అభివృద్ధి, స్వయంప్రతిపత్తికి ఒక అడుగుగా కేంద్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ ప్రాంతానికి శాసన అధికారాలు, ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆందోళనలు తలెత్తాయి. పూర్తి స్థాయి రాష్ట్రాల మాదిరిగా కాకుండా, కేంద్రపాలిత ప్రాంతాలు భూమి, చట్టాన్ని అమలు చేయడం, పన్ను వసూలు వంటి అంశాలలో పరిమిత అధికారాలను కలిగి ఉంటాయి. కాశ్మీర్ లోయ మొత్తం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంపై ఆధిపత్యం చెలాయించేదని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. అయితే, 2019 ఆగస్టు 5 తర్వాత ఉద్భవించిన వాస్తవ పరిస్థితుల ప్రకారం, జమ్ము ప్రాంతం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన లేహ్ - లడఖ్ ప్రాంతం సంతృప్తి చెందలేదు. జమ్మూ, కశ్మీర్ కూడా అసంతృప్తితో ఉన్నాయి. ఈ ఉద్యమం ఏదైనా రాజకీయ ఆసక్తితో హఠాత్తుగారాలేదు. లడఖ్ ప్రజలు 2020 నుంచి రాష్ట్ర హోదాను డిమాండ్ చేస్తున్నారు. తమ ప్రాంతంపై ఎక్కువ రాజకీయ ప్రాతినిధ్యం, పరిపాలనా నియంత్రణ కోసం స్థానికుల డిమాండ్లతో ఉద్యమం ఊపందుకుంది. లడఖ్ రాష్ట్ర హోదా కోసం డిమాండ్ స్థానిక పరిపాలనపై మరింత నియంత్రణ కోసం డిమాండ్లతో వచ్చింది. రాష్ట్ర హోదా లడఖ్ దాని ప్రత్యేక సామాజిక-ఆర్థిక, పర్యావరణ అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించడానికి వీలు కల్పిస్తుందని తద్వారా స్థిరమైన అభివృద్ధి దాని ఉనికిని కాపాడుకోవచ్చునని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం మొత్తాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. జమ్ము కాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీని కలిగి ఉంటుంది, కానీ లేహ్, లడఖ్ రాజకీయ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కును కలిగి ఉండదు.

రాజ్యాంగ ఉల్లంఘన

రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ దేశంలోని గిరిజన జనాభాకు రాజ్యాంగ రక్షణ. తమ హక్కులను పరిరక్షించడానికి, గిరిజనులు స్వయంప్రతిపత్తి ప్రాంతీయ మండలి, స్వయంప్రతిపత్తి జిల్లా కౌన్సిల్ ఏర్పాటు చేసుకోవచ్చు, ఇవి గిరిజన ప్రాంతాన్ని పరిపాలించే అధికారం కలిగి ఉంటాయి. తద్వారా బయటి నుంచి వచ్చిన ప్రజలు ఈ ప్రాంతంలోని సహజ వనరులను దోపిడీ చేయలేరు. ప్రస్తుతం అసోం, త్రిపుర, మేఘాలయ, మిజోరం, ప్రాంతాలు ఆరవ షెడ్యూల్‌లో ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల కోసం తన ఎన్నికల మేనిఫెస్టోలో, లేహ్- లడఖ్‌కు రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌ను మంజూరు చేస్తామని బీజేపీ స్వయంగా చెప్పింది. హోంమంత్రి కూడా ఈ హామీని చాలాసార్లు చేశారు. అయితే ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు బీజేపీ ఎందుకు సిద్ధంగా లేదు? కారణం సులభంగా అర్థం చేసుకోవచ్చు. లేహ్-లడఖ్‌కు ఆరవ షెడ్యూల్ కోసం డిమాండ్ నెరవేరితే, అధికారం స్వయంప్రతిపత్తి జిల్లా కౌన్సిల్ (ఏడీసీ) చేతుల్లోకి వస్తుంది. ఆరవ షెడ్యూల్లోని నియమాలు, నిబంధనల ప్రకారం, జిల్లా, ప్రాంతీయ కౌన్సిల్‌లు తమ అధికార పరిధిలోని ప్రాంతాన్ని నిర్వహిస్తాయి. లడఖ్ సున్నితమైన పర్యావరణ వ్యవస్థతో కూడిన వ్యూహాత్మక ప్రదేశం రాష్ట్ర హోదాను క్లిష్టతరం చేస్తుంది. వారు భూమి, అటవీ, నీరు, సాగు, గ్రామ పరిపాలన, ఆస్తి, వారసత్వం, వివాహం, విడాకులు, సామాజిక ఆచారాలు వంటి కొన్ని విషయాలపై చట్టాలు చేయవచ్చు. లేహ్-లడఖ్ సహజ వనరులు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. కనుక బీజేపీ ఆరో షెడూల్ ఆమోదం తెలిపితే, లేహ్-లడఖ్ భూములను లాక్కొని దేశంలోని బడా ల్యాండ్ మాఫియాలకు ఇవ్వడానికి వీలుండదు. పార్లమెంటులో విస్తృత ప్రాతినిధ్యం ఆర్టికల్ 370 రద్దు తర్వాత రాష్ట్ర హోదా రద్దుకు ముందు జమ్ము-కశ్మీర్ అసెంబ్లీలో ఈ ప్రాంతానికి నాలుగు సీట్లు ఉన్నాయి. ఇప్పుడు వారికి రాష్ట్ర ప్రభుత్వానికి సమానం ఏమీ లేనందున మొదటిసారిగా తమ రాజకీయ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కు వారికి లేదు. ఇప్పుడు కూడా వారికి ఒకే ఒక పార్లమెంటు స్థానం ఉంది. అందుకే తమ రాజకీయ ప్రాతినిధ్యం కోసం రాష్ట్ర అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను డిమాండ్ చేశారు.

నిరుద్యోగం

ఈ ప్రాంతంలోని అతిపెద్ద సమస్య నిరుద్యోగం. రాజ్యాధికారం లేనందున, పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేనందున ఈ ప్రాంత యువకులు కనీస ఉపాధి అవకాశాలు కోల్పోయారు. వారికి సివిల్ సర్వీసుల్లో ఉపాధి అవకాశాలు లేవు, జమ్ము- కశ్మీర్ బ్యాంక్, ఇతర బ్యాంకులలో కూడా ఉద్యోగ అవకాశాలు లేవు. భారత్ - చైనా సరిహద్దులో ఉన్న ప్రాంతం వ్యూహాత్మక స్థానం, సున్నితమైన పర్యావరణ వ్యవస్థ, పర్యావరణ క్షీణతకు గురయ్యే అవకాశం రాష్ట్ర హోదాపై చర్చను మరింత క్లిష్టతరం చేస్తుంది. సోనమ్ వాంగ్‌చుక్ ప్రకారం, ఈ సరిహద్దు ప్రాంతంలోని రక్షణ దళాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై సంతోషంగా లేవు. ఇవి సాధారణ డిమాండ్లు కావు. అయితే, ఇవి లడఖ్ ప్రజల ఉనికి కోసం, వారి భూములను కార్పొరేట్ సంస్థల నుంచి రక్షించడం కోసం డిమాండ్ చేస్తున్నారు. లడఖ్ రాష్ట్ర హోదా డిమాండ్ కోసం, హిమాలయ ప్రాంతంలో ఉనికి, గౌరవం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి అవకాశాల కోసం పోరాటం. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష రాష్ట్ర హోదా డిమాండ్ కోసం మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య హక్కులు, సమ్మిళిత పాలన, స్థిరమైన అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోసం సాగుతోంది.

కోర్టుల తీర్పుల్లో నిష్పాక్షిత ఉందా?

ఎం కోటేశ్వరరావు

ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొరేట్ల కంపెనీల నుంచి విరాళాలను తీసుకోవటం అక్రమం అని ఆ పథకం ప్రారంభం నుంచి అనేక మంది చెబుతున్నా గొర్రె కసాయివాడిని నమ్మినట్లు చాలా మంది అదొక మంచి సంస్కరణ అని మద్దతు ఇచ్చారు. సుప్రీం కోర్టు 2024 ఫిబ్రవరి 15న ఇచ్చిన తీర్పుతో కొందరు సొంత బుర్రలతో ఆలోచించటం మొదలు పెట్టారు. మరికొందరు బాండ్లను, తీసుకున్న పార్టీలను సమర్థిస్తున్నారు. అనేక కేసుల్లో వచ్చిన తీర్పులు, వాటి తరువాత పదవి నుంచి దిగిపోయిన న్యాయమూర్తులు పొందిన పదవులను చూసిన తరువాత న్యాయవ్యవస్థ మీద జనం విశ్వాసం కోల్పోతున్నారు. అలాంటి స్థితిలో ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు వ్యవహరించిన తీరుతో అనేక మందికి విశ్వాసం పెరిగింది. ఇది మరొక భ్రమకు దారి తీస్తుందా ? మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మీద దర్యాప్తు సంస్థలు సమర్పించిన తప్పుడు వివరాల ప్రాతిపదికన దిగువ కోర్టు యావజ్జీవ శిక్ష విధిస్తే హైకోర్టు దాన్ని కొట్టివేసింది. పదేళ్ల పాటు వేధింపులకు, జైలుపాలై, ఉద్యోగం పోగొట్టుకున్న ఉదంతం చూసిన తరువాత ఎవరికైనా ఏమనిపిస్తుంది ? వ్యవస్థల మీద విశ్వాసం పెరుగుతుందా, తగ్గుతుందా !

పదేళ్ల క్రితం లోక్‌సభ ఎన్నికలకు ముందు దేశాన్ని ఊపివేసిన, బీజేపీకి ఓట్లు, అంతకంటే ఎక్కువ సీట్లు రాల్చిన కేసుల్లో 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం ఒకటి. దీని గురించి ఎంత మందికి జ్ఞాపకం ఉందో? మరోసారి 2024 మార్చి 22న ఢిల్లీ హైకోర్టు దీని గురించి జనానికి గుర్తు చేసింది. అదేమంటే 2017 డిసెంబరు 21 ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టివేసిన ప్రత్యేక కోర్టు తీర్పును తిరిగి విచారించాలని 2018 మార్చి 20వ తేదీన సీబీఐ దాఖలు చేసిన పిటీషన్‌కు అనుకూలంగా ఆరు సంవత్సరాల తరువాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. సదరు తీర్పులో పరస్పర వైరుధ్యాలు కనిపించాయని, దాని మీద అప్పీలు చేయాలా లేదా అనేది సీబీఐ ఇష్టమని చెప్పింది. దీన్నే మరో విధంగా చెప్పాలంటే అనుమతించింది. ఒక తీర్పు మీద చేసిన అప్పీలును పరిష్కరించటానికి ఇన్ని సంవత్సరాలు తీసుకున్న న్యాయవ్యవస్థ మీద, అందునా ఏడుగురు న్యాయమూర్తులు విచారించిన తరువాత సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇచ్చిన తీర్పు మీద జనాలకు ఎలాంటి అభిప్రాయం కలుగుతుంది ? ఎన్నికల బాండ్ల మీద స్పందించిన తీరుకు సంతోషించాలా ? 2జీ కేసులో చేసిందాన్ని మరొక విధంగా భావించాలా? యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న డీఎంకే నేత రాజా, అదే పార్టీ ఎంపీగా ఉన్న కనిమొళి, మరో 16 మంది అధికారులు, ఇతరులు 2జీ కేసులో నిర్దోషులని 2017 తీర్పులో కోర్టు పేర్కొని వారిని విడుదల చేసింది. అనుచిత పద్ధతుల్లో అయిన వారికి వీలుగా అనుసరించిన పద్ధతి కారణంగా లక్షా 76వేల కోట్ల రూపాయలు దేశ ఖజానా నష్టపోయిందన్నది కేసులో వచ్చిన తీవ్ర ఆరోపణ. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆమ్ ఆద్మీ సర్కార్ లైసెన్సుదారులకు రు.30 కోట్ల మేర రాయితీలు అనుచితంగా ఇచ్చిందని, ప్రైవేటు మద్యం వ్యాపారులు దుకాణాలను దక్కించుకునేందుకు అనువుగా విధానాన్ని రూపొందించినందుకు లబ్ది పొందిన వారు వంద కోట్ల రూపాయల ముడుపులు అందచేసినట్లు ఆరోపణలు చేశారు.

అవినీతి ఎంత అయినా అందుకు పాల్పడిన వారిని వదల కూడదు. వంద కోట్ల నిగ్గుతేల్చటంలో రెండు సంవత్సరాలుగా సీబీఐ, ఈడీ కూడా విఫలమైంది. కొందరిని అనుమానితులు, సాక్షులు, నిందితులు అంటూ అరెస్టుచేసి వివరాలు చెప్పాలని వారిని అడుగుతున్నది, నిందితులను నిరవధికంగా బెయిలు రాకుండా జైలుపాలు చేసింది. తాము నిధులు ఇచ్చామంటూ అప్రూవర్లుగా మారిన కొందరు చెప్పటం తప్ప ఆ సొమ్ము ఎవరి ఖాతాకు, ఎలా చేరిందన్నది ఇంతవరకు తెలియదు. బీఆర్ఎస్ నాయకులు కల్వకుంట్ల కవితను ముందు సాక్షి అన్నారు, తరువాత నిందితురాలిగా ప్రకటించిన తరువాత అరెస్టు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తమ ముందుకు హాజరుకావాలని ఈడీ తొమ్మిది సార్లు నోటీసులు ఇచ్చింది. తాను ఏ హోదాలో రావాలో చెప్పమని అడిగితే అదేం కుదరదు మేం రమ్మన్నాం గనుక రావాల్సిందే అన్నట్లుగా వ్యవహరించింది. దాంతో తనను బలవంతం చేస్తున్నారని, రక్షణ కల్పించాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. ఆ సందర్భంగా వ్యక్తిగత హోదాలో విచారణకు రావాలని, వచ్చిన తరువాత అరెస్టు చేస్తామని గాని, లేదని గానీ తాము చెప్పటం లేదని ఈడీ కోర్టులో వాదించింది. కోర్టు కేజ్రీవాల్ కోరినట్లుగా రక్షణ కల్పించేందుకు తిరస్కరించింది. వెంటనే ఈడీ అధికారులు కేజ్రీవాల్ ఇంటికి పోవటం సోదా తతంగం, అరెస్టు అంతా నాటకీయంగా జరిగింది. వంద కోట్ల మద్యం కేసు మీద ఇంత తీవ్రంగా కేంద్రీకరించిన అదే సీబీఐ, ఈడీ కాగ్ చెప్పిన లక్షా 76వేల కోట్ల నష్టం జరిగిందన్న కేసులో ముడుపులను నిరూపించటంలో ఎందుకు ఘోరంగా విఫలమైనట్లు ? ప్రభుత్వ సంస్థలను తమ ప్రయోజనాల కోసం ఎలా ఉపయోగించుకుంటారో ఎన్నికల బాండ్ల కేసులో ఎస్‌బీఐ తీరు తిరుగులేని విధంగా వెల్లడించింది. సుప్రీం కోర్టు తీర్పును వమ్ముచేసేందుకు తమ దగ్గర ఉన్న ఆధారాలను సమర్పించాలంటే మూడు నెలలు పడుతుందని కోర్టునే తప్పుదారి పట్టించేందుకు చూసింది. చివరకు విధిలేక వెంటనే సమర్పించింది. అది ఎలా సాధ్యమైంది ? ఎందుకు, ఎవరిని రక్షించేందుకు ముందు తలాయించినట్లు ? కచ్చితంగా బీజేపీని రక్షించేందుకే అన్నది స్పష్టం. రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ స్టేట్‌బ్యాంకు పరువు మురికి గంగలో కలిసింది. అక్రమాలకు పాల్పడిన ప్రైవేటురంగ ఎస్ బాంకును ఆదుకొనేందుకు అధికారంలో ఉన్న పెద్దలు ఆరువేల కోట్ల రూపాయలను ఎస్‌బీఐ ద్వారా ఇప్పించినప్పుడే అది స్వతంత్ర సంస్థకాదు పాలకుల కీలుబొమ్మ అని తేలింది. సీబీఐ, ఈడీ డైరెక్టర్ల పదవీ కాలాన్ని నియంత్రించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఉందని 2023 జులైలో ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. అందువలన ఆ సంస్థల పదవుల్లో ఉన్నవారు, వాటి కోసం అర్రులు చాస్తున్నవారు కేంద్ర పెద్దలు చెప్పినట్లుగా నడుచుకుంటారన్నది స్పష్టం. అందుకు సిద్దపడ్డ వారినే ఎంపిక చేస్తారు. అందువలన అవి స్వతంత్ర సంస్థలని చెప్పటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదు. గతేడాది మార్చి నెలలో పద్నాలుగు ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఈడీ అరెస్టుల నుంచి రక్షించాలని సుప్రీం కోర్టు తలుపు తట్టారు. గడచిన పదేళ్ల కాలంలో ఆ సంస్థ చేసిన అరెస్టుల్లో 95శాతం ప్రతిపక్షాలకు చెందిన వారే ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆలోచన ఎంత ప్రమాదకరంగా ఉందో ఒక కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వెల్లడించింది. నిందితుడిని అరెస్టు చేసేందుకు ఈడీ తగిన కారణాలు చూపుతూ ఎలాంటి మినహాయింపులు లేకుండా రాతపూర్వకంగా నోటీసు అందచేయాలని ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం, ఇతరులు దాఖలు చేసిన పిటీషన్ మీద ఎలాంటి పునరాలోచన అవసరం లేదని పేర్కొన్నది. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదనే ఒక్క కారణంతో కూడా ఎవరినైనా అరెస్టు చేయవచ్చనే ఈడీ వాదనను తోసిపుచ్చుతూ ఒక మనీలాండరింగ్ కేసులో గతేడాది అక్టోబరులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఈడీ తీరు పారదర్శకంగా ఉండాలని, వేధింపులకు గురిచేస్తున్నట్లుగా ఉండకూడదని పేర్కొన్నది. మనీలాండరింగ్ చట్టం 2002లో సెక్షన్ 50 ప్రకారం సమన్లకు సాక్షి సహకరించటం లేనందున సెక్షన్ 19 ప్రకారం అరెస్టుకు అతడు లేదా ఆమె అర్హురాలే అని ఈడీ చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. దీని మీద పునరాలోచన చేయాలని ఈడీ వాదనను సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక పిటీషన్ దాఖలు చేయటం నిరంకుశ అధికారాలను దానికి కట్టబెట్టాలని చూడటమే. ముంబై కేంద్రంగా హిందూస్థాన్ టైమ్స్‌లో పని చేసిన సీనియర్ ఎడిటర్ సతీష్ నందగోంకర్‌ను ఆ పత్రిక ఎడిటర్ వేధించిన తీరు అతను మరణించిన తరువాత వెల్లడైంది. మరణానికి దారి తీసిన కారణాలపై ముంబై ప్రెస్ క్లబ్ పరిశోధన జరిపింది. కొంత మంది ఫ్రీలాన్సర్ జర్నలిస్టులు రాసిన వార్తలను ప్రచురించాలని నందగోంకర్ సంపాదకుడికి పంపారు. వాటిని ప్రచురించకపోవటమే గాక పనికిమాలినవంటూ అవమానించాడు. అయితే పత్రికలో తనకున్న అవకాశాన్ని వినియోగించుకొని ఆన్‌లైన్ ఎడిషన్‌లో వాటిని ప్రచురించారు. అవి ముద్రణ సంచికల్లో రాలేదు. కొన్ని రోజుల తరువాత నందగోంకర్‌ను ఆన్‌లైన్ స్టోరీలను ఎంపిక చేసి ప్రచురించే బాధ్యతల నుంచి తొలగించి అవమానించారు. ఆ ఒత్తిడితో ఆయన గుండెపోటుకు గురై మరణించినట్లు తేలింది. తమకు నచ్చని కథనాలను రాసే జర్నలిస్టులను యజమానులు ఎలా వేధించేది అందరికీ తెలిసిన సత్యమే. దీనికి మీడియా యాజమాన్యాలకు పార్టీలకు, అధికారంలో ఉన్నవారితో ఉన్న పరస్పర ప్రయోజన సంబంధాలే కారణం. గతంలో కూడా వివిధ వ్యవస్థలను అధికారంలో ఉన్న కాంగ్రెస్ దుర్వినియోగం చేసింది. ప్రతిపక్షంగా దాన్ని విమర్శించిన బీజేపీ ఇప్పుడు అంతకంటే వేగంగా, దారుణంగా దుర్వినియోగానికి పాల్పడుతోంది. వ్యవస్థల మీద జనాలకు విశ్వాసం కోల్పోవటాన్ని వేగిరం చేస్తోంది.

మహిళా సంక్షేమ పథకాలకు తూట్లు

మోదీ ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శ

న్యూఢిల్లీ: మహిళా సంక్షేమ పథకాల అమలులో మోదీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ మండిపడింది. బడ్జెట్‌లోనూ మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమ పథకాల కేటాయింపులు తగ్గించిందని, ఐదు కీలక సమస్యల పరిష్కారంలో వైఫల్యం మూటగట్టుకుందని ధ్వజమెత్తింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం 10 ఏళ్ల మోదీ ప్రభుత్వ హయాంలో మహిళా సంక్షేమ పథకాల అమలు తీరును ప్రశ్నించారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో అంగన్‌వాడీలు, పోషకాహార పథకాలు, మహిళల భద్రత, శిశు సంరక్షణ సంస్థలకు కేవలం 0.55 శాతం మాత్రమే కేటాయించారని జైరాం రమేశ్ విమర్శించారు. గత నాలుగేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో ఎండబ్ల్యూసీడీ వాటా 0.75 శాతం కంటే తక్కువగా ఉందని స్పష్టం చేశారు. హిమాచల్ ప్రదేశ్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ సుప్రియా శ్రీనతే అభ్యంతరకరమైన పోస్ట్ చేశారంటూ ఈసీకి జాతీయ మహిళా కమిషన్ ఫిర్యాదు చేయడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ 'నారీశక్తి' (మహిళా సాధికారత) అంటూ బీజేపీ నినాదాలే తప్ప వారి సంక్షేమ కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. 10ఏళ్లుగా మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అసమర్థత, ఉదాసీనత మహిళా వ్యతిరేక మనస్తత్వానికి అద్దం పడుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు జరిగినప్పుడు ఆ శాఖ మౌనంగా ఉంటుందని, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో నేరాలకు మాత్రమే మేల్కొంటారని ఎద్దేవా చేశారు. కష్టపడి పనిచేసే మహిళలకు మంత్రిత్వ శాఖ నిధులు దూరం చేస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఐదు అంశాల్లో వైఫల్యాన్ని మూటగట్టుకుందని ధ్వజమెత్తారు. మహిళలు, చిన్నారులపై దాడులు రెట్టింపయ్యాయని, బడ్జెట్‌లో కోతలు, నిధుల తగ్గింపు, తక్కువ వేతనం, అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల అసహ్యంగా ప్రవర్తించడం, మహిళలు, చిన్నారుల్లో పెరుగుతున్న రక్తహీనత, నిరుద్యోగం, ఆదాయంలో కోతలు వంటి ఐదు అంశాల పట్ల మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని అన్నారు. పదేళ్లలో మహిళలపై నేరాలు రెట్టింపు అయ్యాయని, 2012లో 2.4 లక్షల నేరాలు జరగగా, 2022 నాటికి 4.5 లక్షలకు పెరిగినట్లు వివరించారు. మహిళలపై నేరాలను పరిష్కరించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'నిర్భయ' నిధులను 2022 నాటికి కేవలం 35 శాతం మాత్రమే ఉపయోగించారని అన్నారు. రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపుల ఫిర్యాదులపై మోదీ ప్రభుత్వం స్పందించలేదని, బిల్కిస్ బానో కేసులో నిందితులను నిర్దోషులుగా విడుదల చేశారని, అలాగే మణిపూర్‌లో లైంగిక దాడుల కేసుల్లోనూ ప్రభుత్వం మౌనంగానే ఉందని అన్నారు. మణిపూర్ నుండి ప్రతి రోజూ అత్యాచారం, దాడికి సంబంధించిన కొత్త కేసులు వస్తుంటే ప్రధాని, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉదాసీనంగా వ్యవహరించినట్లు ఆరోపించారు. మహిళలపై దాడికి పాల్పడిన భయానక వీడియోలు బయటికి వచ్చిన తర్వాత కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం ఆ ఘటనలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రకటన కూడా చేయలేదని, అప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు.

భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం

చైనా వాదనను కేంద్రం గట్టిగా ఖండించాలి: ఖర్గే

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగమని కాంగ్రెస్ మంగళవారం నొక్కి చెప్పింది. అరుణాచల్‌పై చైనా తరచూ చేస్తున్న వాదనలను మోదీ ప్రభుత్వం 'గట్టిగా ఖండించాలని' ఆయన పిలుపునిచ్చారు. బీజింగ్ వాదన 'అసంబద్ధం', 'హాస్యాస్పదం' అని భారతదేశం కొట్టిపారేసినప్పటికీ, చైనా సోమవారం అరుణాచల్ ప్రదేశ్ 'ఎల్లప్పుడూ' తమ భూభాగమేనని పునరుద్ఘాటించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వాదనల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో స్పందిస్తూ, అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగమన్నారు. 'అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా వాదనలకు సంబంధించి ఏదైనా ఆలోచనను భారత జాతీయ కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. వ్యతిరేకిస్తుంది. చైనీయులు తమ అత్యున్నత కార్యాలయాల నుంచి పూర్తిగా హాస్యాస్పదమైన, అసంబద్ధమైన వాదనలు చేయడం ఒక నెలలో ఇది నాలుగోసారి' అని పేర్కొన్నారు. 'ఇతర దేశాలకు చెందిన స్థలాల పేర్లను మార్చడం, భూభాగాల మ్యాప్‌లను మళ్లీ గీయడం ద్వారా అసంబద్ధ వాదనలు చేయడంలో చైనా రికార్డు అందరికీ తెలిసిందేనని ఖర్గే అన్నారు. 'పక్షపాత రాజకీయాలకు అతీతంగా భారతదేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడంలో మేము కలిసి ఉన్నాము. అయినప్పటికీ, ప్రధాన మంత్రి (నరేంద్ర) మోదీ తన 'లాల్ ఆంఖ్'పై చర్య తీసుకోకపోవడం, అలాగే, జూన్ 19, 2020న గాల్వాన్‌లో 20 మంది భారతీయ ధైర్యవంతులు దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన గాల్వాన్ ఘటనపై చైనాకు క్లీన్‌చీట్ ఇవ్వడమే చైనా వాదనలకు కారణమని ఆయన ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌కు సమీపంలో ఉన్న సరిహద్దులో గ్రామాలను నిర్మించడం లేదా సరిహద్దుల సమీపంలో నివసించే మన ప్రజలను అపహరించడం కావచ్చన్నారు. మోదీ ప్రభుత్వ 'ప్లీజ్ చైనా పాలసీ' అరుణాచల్‌లో మన దేశ భద్రతకు ప్రమాదం కలిగించిందని తెలిపారు. లడఖ్‌తో పాటు అరుణాచల్ ప్రదేశ్‌లో 'మోదీకి చైనీస్ గ్యారెంటీని' నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. 'మోదీ ప్రభుత్వం చైనా చేస్తున్న అసంబద్ధ వాదనలపై బలమైన ఖండనతో ముందుకు రావాలని మేము ఇప్పటికీ ఆశిస్తున్నాము. మన సరిహద్దులలో శాంతి, ప్రశాంతతను మేము కోరుకుంటున్నాము' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు.

జైరాం రమేశ్‌పై స్మృతి ఇరానీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: బీజేపీ ప్రభుత్వం చేస్తున్న నారీశక్తి నినాదాలు ఉత్తి మాటలుగా మిగిలిపోయాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన ఆరోపణలపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పి కొడుతూ గాంధీ కుటుంబంపై విమర్శలు గుప్పించారు. 'చాలాకాలం నుంచి దేశానికి నిజమైన వారసులమంటూ చెప్పుకొంటున్న వంశ పాలకులు దేశ సంపదను దోచుకున్నారు. పార్టీ పతనమైనా వారి అనుచరులు వాస్తవాలను వక్రీకరిస్తూనే ఉన్నారు. మహిళా సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అణగదొక్కడానికి గణాంకాలను తారుమారు చేస్తున్నార'ని దుయ్యబట్టారు. జైరాం రమేశ్‌ను గాంధీల కోర్టియర్ (సభికుడి)గా ఆమె అభివర్ణించారు. మహిళల భద్రత కోసం యూపీఏ ప్రభుత్వ హయాంలో 'నిర్భయ ఫండ్' ఏర్పాటు చేసినా అందులో నుంచి వాళ్లు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా 40 ప్రాజెక్టులు రూపొందించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ నేతపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సినీ నటి కంగనా రనౌత్‌కు సంబంధించిన ఓ అభ్యంతరకర పోస్టు దుమారం రేపుతోంది. దీనిపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యకు పాల్పడిన సుప్రియా శ్రీనతేపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. తన ఫిర్యాదులో హెచ్.ఎస్.అహిర్ పేరును ప్రస్తావించింది. మహిళల గౌరవానికి భంగం కలిగించే ప్రవర్తన ఏ మాత్రం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేసింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ అభ్యర్థిగా బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌ను బీజేపీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆమెను ఉద్దేశించి కాంగ్రెస్ మహిళా నేత సుప్రియ చేసిన పోస్టుపై బీజేపీ వర్గాలు భగ్గుమన్నాయి. ఆమెపై చర్యలు తీసుకోవాలని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను డిమాండ్ చేశాయి. ప్రతి మహిళ తన గౌరవానికి అర్హురాలని పేర్కొన్న కంగన ... గుజరాత్ కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన అభ్యంతరకర సంభాషణను షేర్ చేశారు. 'ఒక యువకుడికి టికెట్ లభిస్తే... అతడి సిద్ధాంతాలను విమర్శిస్తారు. అదే యువతికి టికెట్ ఇస్తే... ఆమె లైంగికతపై దాడి జరుగుతుంది. ఇదేం విచిత్రమో. కాంగ్రెస్ నేతలు ప్రదర్శించిన ఇలాంటి అసభ్యకరమైన ధోరణి సిగ్గుచేటు' అని విరుచుకుపడ్డారు. ఈ సమయంలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఈ బాలీవుడ్ నటికి మద్దతుగా నిలిచారు. ఉక్కు మహిళలతో ఎలా వ్యవహరించాలో ఆ నేతలకు తెలీదంటూ ఎద్దేవా చేశారు. ఇదిలాఉంటే.. ఈ పోస్టుపై ఇప్పటికే సుప్రియ స్పష్టత ఇచ్చారు. 'నా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల యాక్సెస్ చాలామంది వద్ద ఉంది. వారిలో ఒకరు ఈ అభ్యంతరకర పోస్ట్ పెట్టారు. నా దృష్టికి వచ్చిన వెంటనే దాన్ని తొలగించాను. నేను ఏ మహిళ గురించి కూడా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయను. ఈ వ్యవహారంపై 'ఎక్స్'లో ఫిర్యాదు చేశాను' అని వివరణ ఇచ్చారు.

సంక్షేమ పథకాలు ఆగవు

దుష్ప్రచారం నమ్మొద్దు: ఢిల్లీ సర్కార్

న్యూఢిల్లీ: ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో నెలకొన్న పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొన్ని శక్తులు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ఆప్ ప్రభుత్వం ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రణాళిక శాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కేజ్రీవాల్ అరెస్టుతో ఢిల్లీలో అమలవుతోన్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు నిలిచిపోతాయంటూ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు చేస్తోన్న దుష్ప్రచారంపై ప్రజల్ని అప్రమత్తం చేసింది. నేర పరిశోధన ప్రక్రియలో చట్టం తన పని తాను చేస్తుందని, పథకాల అమలు, పాలన అనేవి వ్యక్తులకు సంబంధించినవి కావని స్పష్టం చేసింది. సామాన్య ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని ప్లానింగ్ విభాగం కార్యదర్శి నిహారికా రాయ్ ఆ ప్రకటనలో తెలిపారు. సీఎం కేజ్రీవాల్ ఆదేశాల మేరకే ఈ ప్రకటన వెలువడినట్లు ఆప్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో మాదిరిగానే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలు, పింఛన్లు తదితర సేవలన్నీ నిరాటంకంగా కొనసాగుతాయని నిహారిక స్పష్టంచేశారు. ప్రజా సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపులతో సంఘటిత నిధి ద్వారా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారని, ఈ డబ్బు ఒక వ్యక్తి లేదా రాజకీయ పార్టీల సొంత ఆస్తులు కాదన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి అరెస్టు లేదా రిమాండ్‌తో ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రభావమేమీ ఉండదని పేర్కొన్నారు. కొన్ని స్వార్థపూరిత శక్తులు చేసే ఇలాంటి తప్పుదారి పట్టించే సమాచారాన్ని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డబ్బు కోసం బాలుడి కిడ్నాప్

చంపేసి గోనె సంచిలో కుక్కిన నిందితుడు

థానె: మహారాష్ట్ర థానేలోని గోరేగావ్‌లో డబ్బు కోసం తొమ్మిదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి, అనంతరం హత్య చేసి గోనె సంచిలో కుక్కిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం థానేలోని గోరేగావ్‌కు చెందిన సల్మాన్ మౌల్వీ అనే వ్యక్తి టైలర్‌గా జీవనం సాగిస్తున్నాడు. చాలాకాలం నుంచి ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నా అతని వద్ద అంత డబ్బు లేకపోవంతో ఎవరినైనా కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేయాలని కుట్ర పన్నాడు. ఇందులో భాగంగా అదే గ్రామానికి చెందిన ఇదాబ్(9) అనే బాలుడు ఆదివారం సాయంత్రం మసీదులో ప్రార్థనలు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా కిడ్నాప్ చేశాడు. బాలుడిని ఇంటికి తీసుకెళ్లి గోనె సంచిలో కట్టేసి ఇంటి వెనుక పెరట్లో దాచాడు. అనంతరం బాలుడి తండ్రికి ఫోన్ చేసి రూ.23 లక్షలు ఇవ్వాలని, లేదంటే ఇదాబ్‌ను హత్య చేస్తామని బెదిరించాడు. బాలుడు అపహరణకు గురయ్యాడని తెలియడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు అతడి కోసం వెతికారు. అనంతరం బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం సల్మాన్‌కు తెలియడంతో భయంతో మొబైల్‌లోని సిమ్ కార్డ్ తీసి పారేశాడు. గాలింపు చర్యల్లో భాగంగా పోలీసులు సల్మాన్ ఇంటిని తనిఖీ చేయగా హత్య చేసి గోనె సంచిలో కట్టి పడేసిన బాలుడి మృతదేహం లభించింది. నిందితుడిని అరెస్టు చేశారు. కిడ్నాప్, హత్య ఘటనలో సల్మాన్ సోదరుడు సఫువాన్ మౌల్వీ ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానించిన పోలీసులు...అతడిని అదుపులోకి తీసుసుకున్నారు.

రాధికకు రూ.53.45 కోట్ల ఆస్తులు

చెన్నై: దేశంలో సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. తొలి దశ పోలింగ్‌కు నోటిఫికేషన్ విడుదలవ్వడంతో అనేక చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. తమిళనాడులోని విరుదునగర్ నుంచి బరిలో దిగిన బీజేపీ అభ్యర్థి, ప్రముఖనటి రాధికా శరత్ కుమార్ నామినేషన్ వేశారు. ఇందులో తన మొత్తం ఆస్తుల విలువను రూ.53.45 కోట్లుగా ప్రకటించారు. రూ.33.01 లక్షల నగదు, 75 తులాల బంగారం, 5 కేజీల వెండి ఆభరణాలు, వస్తువులతో కలిపి రూ.27.05 కోట్ల చరాస్తులున్నట్లు రాధిక నామినేషన్‌లో పేర్కొన్నారు. రూ.26.40 కోట్ల స్థిరాస్తులతో పాటు రూ.14.79 కోట్ల అప్పులు ఉన్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం ఆమె రాడాన్ మీడియా వర్క్స్ ఇండియా లిమిటెడ్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాధిక భర్త, నటుడు ఆర్.శరత్ కుమార్ తన పార్టీ ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చిని బీజేపీలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే విరుదునగర్ నుంచి కాషాయ పార్టీ ఆమెను నిలబెట్టింది. ఈ స్థానానికి తొలి దశలోనే ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. రాధిక ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి.

గాంధీ వారసుడు అయినందుకే: అధీర్



బహరంపూర్: గాంధీ కుటుంబంతో ఉన్న అనుబంధం కారణంగానే వరుణ్ గాంధీకి బీజేపీ లోక్‌సభ టికెట్ నిరాకరించిందని, తమ పార్టీలో చేరవలసిందిగా ఆయనకు ఆహ్వానం పంపినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి మంగళవారం తెలిపారు. వరుణ్‌ను 'దబాంగ్ నేత (బలమైన నాయకుడు)'గా అభివర్ణించారు. 'అతను దబాంగ్ నేత. చాలా చదువుకున్న వ్యక్తి. అతనికి క్లీన్ ఇమేజ్ ఉంది. గాంధీ కుటుంబంతో వరుణ్ గాంధీకి అనుబంధం ఉంది. అందుకే బీజేపీ ఆయనకు లోక్‌సభ ఎన్నికల టికెట్ నిరాకరించింది. ఆయన రావాలి (కాంగ్రెస్‌లో చేరాలి), మేము చాలా సంతోషిస్తాం అని నేను అనుకుంటున్నాను' అని అధీర్ అన్నారు. పిలిభిత్ నుంచి రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపీగా ఉన్న వరుణ్, కేంద్రంలో, ఉత్తర ప్రదేశ్‌లోని తన పార్టీ ప్రభుత్వాలను విమర్శించే అభిప్రాయాలను తరచుగా పేర్కొంటూ వచ్చారు. అయితే సుల్తాన్‌పూర్ నుంచి ఆయన తల్లి మేనకా గాంధీ పేరును బీజేపీ మళ్లీ ప్రతిపాదించింది. ఉత్తర ప్రదేశ్‌లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో పిలిభిత్ స్థానానికి పోటీ చేసేందుకు వరుణ్ స్థానంలో కాంగ్రెస్ మాజీ సభ్యుడు జితిన్ ప్రసాదను ఎంపిక చేశారు.

మోదీని, బీజేపీని ఇంటికి పంపుతాం: ఉదయనిధి

చెన్నై: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి విరుచుకుపడ్డారు. తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాలో మంగళవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఉదయనిధి మాట్లాడుతూ డీఎంకే నేతలకు నిద్ర లేకుండా చేస్తున్నామని మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు ఉదయనిధి తీవ్రంగా స్పందించారు. మోదీని, బీజేపీని ఇంటికి పంపించేదాకా తమ పార్టీ నిద్రపోదన్నారు. 'డీఎంకే నేతలకు నిద్రరావడం లేదని ప్రధాని అంటున్నారు. అవును... మేం నిన్ను, బీజేపీని ఇంటికి పంపించేదాకా నిద్రపోము. 2014లో గ్యాస్ సిలిండర్ రూ. 450...ఇప్పుడు రూ.1200. ఇటీవలే పీఎం రూ.100 తగ్గించి డ్రామా ఆడారు. ఎన్నికల తర్వాత గ్యాస్ ధరను తిరిగి రూ.500 పెంచుతాడు' అని ఉదయనిధి విమర్శించారు. కాగా, తమిళనాడులో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తొలి దశలోనే ఏప్రిల్ 19న జరగనుంది. ఇందుకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

ఉద్యోగాల పేరుతో బీజేపీ మోసం

రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ : ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీపై బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. దేశ వ్యాప్తంగా యువత తమకు అబద్ధాలు చెప్పిందని అడుగుతున్నారని తెలిపారు. బీజేపీ సృష్టించిన భ్రమలను ఛేదించి యువత తమ భవితవ్యాన్ని తామే మార్చుకోవాలని, ఎన్నికల ముందు యువతకు చేసిన వాగ్దానమైన 'యువ న్యాయం' ద్వారా ఉపాధి విప్లవానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని ఆయన హామీ ఇచ్చారు. 'నరేంద్ర మోదీ జీ, మీకు ఉపాధి కోసం ఏదైనా ప్రణాళిక ఉందా? ఈ ప్రశ్న ఈ రోజు ప్రతి యువకుడి పెదవుల్లో ఉంది. ప్రతి వీధి, పల్లెలో బీజేపీని అడుగుతున్నారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అబద్ధం ఎందుకు చెప్పారు' అని ఆయన ప్రశ్నించారు. 'యువ న్యాయం అధ్వర్యంలో ఉపాధి విప్లవం చేపట్టాలని కాంగ్రెస్ సంకల్పించింది. ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. చదువుకున్న ప్రతి యువకుడికి 'పెహ్లీ నౌక్రి పక్కీ' పథకం కింద ఏడాదికి లక్ష రూపాయల ఉద్యోగం ఇస్తాం. మేము చట్టం చేయడం ద్వారా పేపర్ లీక్‌లను తొలగిసాము' అని కాంగ్రెస్ నాయకుడు 'ఎక్స్'లో హిందీలో పోస్ట్ చేశారు. నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్... బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆ సమస్యను ఎత్తి చూపాలని భావిస్తోంది. 'రెండు సిద్ధాంతాల విధానాల్లోని వ్యత్యాసాన్ని గుర్తించాల్సిన సమయం ఇది. యువత భవిష్యత్తును నిర్మించాలని కాంగ్రెస్ భావిస్తుంటే, బీజేపీ వారిని తప్పుదోవ పట్టించాలని చూస్తోంది. యువత భ్రమల వలయాన్ని ఛేదించి తమ చేతులతో తమ విధిని మార్చుకోవలసి ఉంటుంది. దేశంలో 'ఉపాధి విప్లవం' తీసుకురావాలి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

మమతపై బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

తృణమూల్ నేతల ఆగ్రహం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై బీజేపీ నేత దిలీప్‌ఘోష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ కూతురునని చెప్పుకుంటున్న మమతా బెనర్జీ...తన తండ్రి ఎవరో ముందు నిర్ధారణ చేసుకోవాలన్నారు. దిలీప్‌ఘోష్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'మమత గోవా వెళ్లి గోవా బిడ్డనంటుంది. త్రిపుర వెళ్లి త్రిపుర బిడ్డనంటుంది. అసలు తన తండ్రి ఎవరో ముందు మమత నిర్ణయించుకోవాలి' అని ఘోష్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో దుర్గామాతపై, ఇప్పుడు మమతా బెనర్జీపై ఘోష్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు నైతికంగా ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. కాగా, 2021లో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ వాడిన 'బెంగాల్ వాంట్స్ టు గో విత్ డాటర్' నినాదం బాగా ప్రాచుర్యం అయింది. ఆ ఎన్నికల్లో తృణమూల్ ఘన విజయం సాధించింది.

బీజేపీ అభ్యర్థులుగా ఆరుగురు రెబెల్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఐదో జాబితాను విడుదల చేసిన బీజేపీ ప్రచారంలో దూసుకుపోతోంది. తాజాగా లోక్‌సభ ఎన్నికలతో పాటు హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఉపఎన్నికలకు అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్‌లో రాజ్యసభ ఎంపీ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి ఆరుగురు రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఓటు వేసిన విషయం తెలిసిందే. దీంతో ముగ్గురు కాంగ్రెస్, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. అనంతరం అనర్హతకు గురైన ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. తాజాగా ప్రకటించిన బీజేపీ అభ్యర్థుల జాబితాలో వారు చోటు సంపాదించుకున్నారు. సుధీర్‌శర్మ- ధర్మశాల, రవి ఠాకుర్- లాహౌల్ అండ్ స్పితి, రాజిందర్ రానా- సుజన్‌పూర్, ఇందర్ దత్ లకాన్ పాల్- బర్సార్, చైతన్య శర్మ- గాగ్రేట్, దేవిందర్ కుమార్ భుట్టో- కుట్లేహర్ స్థానాల్లో బరిలోకి దిగనున్నారు. ఈ ఆరు స్థానాలకు ఏడో విడతలో భాగంగా జూన్ ఒకటిన పోలింగ్ జరగనుంది. అదే రోజు హిమాచల్‌ప్రదేశ్‌లోని నాలుగు లోక్‌సభ స్థానాలకు కూడా పోలింగ్ జరగనుంది. అదేవిధంగా గుజరాత్‌లో ఐదు స్థానాలు, కర్నాటకలో ఒక స్థానం, పశ్చిమ బెంగాల్‌లో రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది.

బెయిల్ షరతులతో అడ్డుకోలేం: సుప్రీం



న్యూఢిల్లీ: బెయిల్ షరతులతో ఓ వ్యక్తిని రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనకుండా కోర్టులు అడ్డుకోలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒడిశా హైకోర్టు విధించిన బెయిల్ షరతును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఇటువంటి షరతు విధించడం పిటిషన్‌దారుడి ప్రాథమిక హక్కులు ఉల్లంఘించడమేనని, షరతులు విధించకూడదని జస్టిస్ బీఆర్ గవై, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తమ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో హైకోర్టు విధించిన షరతును తాము రద్దు చేసి, పక్కన పెడతామని ధర్మాసనం తెలిపింది. జనవరి 18న ఒడిశా హైకోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ బరంపూర్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శివశంకర్ దాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2022 ఆగస్టులో బెయిల్‌పై విడుదల సందర్భంగా హైకోర్టు ఈ షరతు విధించింది. అయితే మాజీ మేయర్ శివశంకర్ దాస్ రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తి కావడంతో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అనుమతించాల్సిందిగా ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.

ఢిల్లీలో పెరిగిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. సోమవారం ఢిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 33.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని భారత వాతావరణశాఖ మంగళవారం తెలిపింది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఢిల్లీలో ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు చేరుకోనుందని, దీంతో ఆ రాష్ట్రంలో విపరీతమైన వేడి వాతావరణం ఉండనుందని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుతం ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 15.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సీజన్ సగటు కంటే ఒక డిగ్రీ తక్కువ. ఆ రాష్ట్రంలో తేమ శాతం 40 నుంచి 94 శాతం వరకు ఉంటుందని ఐఎండీ తెలిపింది. అనేక రాష్ట్రాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు ఈశాన్య భారతదేశం, పశ్చిమ బెంగాల్‌లోని ఉప- హిమాలయ ప్రాంతంలో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రజారోగ్యంపై కేజ్రీవాల్ రెండో ఆదేశాలు

న్యూఢిల్లీ: మద్యం పాలసీకి సంబంధించిన మనీలాం డరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయం నుంచి మంగళవారం రెండోసారి ఉత్తర్వులు జారీ చేశారు. లాకప్ నుంచి కేజ్రీవాల్ రెండో ఆదేశాలు జారీ చేసినట్లు ఆప్ నేత, ఢిల్లీ ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ వెల్లడించారు. ఈడీ కస్టడీ నుండి కూడా కేజ్రీ వాల్ ఢిల్లీ ప్రజల ఆరోగ్య పరిరక్షణ గురించి ఆలోచిస్తున్నారని, తాను జైలుకెళ్లినందువల్ల ఢిల్లీ ప్రజలు బాధపడకూడదని ఆందోళన చెందుతు న్నారని తెలిపారు. మొహల్లా క్లినిక్‌లలో ఉచిత ఔషధాల కొరత లేకుండా చూసుకోవాలని కేజ్రీవాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆరోగ్య మంత్రి చెప్పారు. మొహల్లా క్లినిక్‌లలో నిర్వహించే పరీక్షల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవా లని ఆదేశించినట్లు తెలిపారు. 'మీ సీఎం జైల్లో ఉన్నా మీ గురించే ఆలోచిస్తున్నారని ఢిల్లీ ప్రజ లకు భరోసా కల్పించాలని కోరాం' అని తెలి పారు. నీటి సమస్యను పరిష్కరించాలని కేజ్రీ వాల్ ఉత్తర్వులిచ్చినట్లు ఆదివారం ఢిల్లీ మంత్రి అతిశి పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశాన్ని ఈడీ తీవ్రంగా పరిగణించింది.

రష్యా యుద్ధంలో చిక్కుకున్న కేరళ యువకులను వెంటనే తీసుకురండి

కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీపీఐ రాజ్యసభ సభ్యుడు వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: రష్యాలో చిక్కుకున్న కేరళకు చెందిన కొంతమంది భారత పౌరులు, వారి విషయంలో అక్కడి భారత రాయబార కార్యాలయ అధికారులు వ్యవహరించిన తీరు పట్ల తక్షణం స్పందించవలసిందిగా సీపీఐ రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం మంగళవారం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు ఒక లేఖ రాశారు. కేరళ పౌరుల పట్ల అక్కడి అధికారులు వ్యవహరించిన తీరును తక్షణం మీ దృష్టికి తీసుకువస్తున్నా అని పేర్కొన్నారు. మంచి జీతంతో కూడిన ఉద్యోగమంటూ ఏజెంట్లచే ఆకర్షితులైన నిరుద్యోగం, పేదరికంలో ఉన్న భారత్‌కు చెందిన యువత మోసపోయారని, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయారని తెలిపారు. బాధిత యువత, వారి కుటుంబాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, వారి బాధకరమైన పరిస్థితిని వివరించినప్పటికీ రష్యాలోని భారత రాయబార కార్యాలయం స్పందించలేదని తెలిపారు. 'ఒంటరిగా ఉన్న యువకులకు రాయబార కార్యాలయ అధికారుల సమాధానం వేచి ఉండటమే. వారి సమస్యను పరిష్కరించడానికి, వారిని తిరిగి ఇంటికి తీసుకురావడానికి ఎటువంటి కచ్చితమైన చర్యలు తీసుకోలేదు. తాజా సమాచారం ప్రకారం, యుద్ధంలో భారత పౌరుడు ఒకరు గాయపడ్డాడు. అక్కడ నెలకొన్న బాధాకరమైన పరిస్థితి గురించి తెలిసినప్పటికీ, భారత రాయబార కార్యాలయ అధికారులు కొన్ని పత్రాలు సమర్పించాలని కోరారు. భారత యువకుల వద్ద డబ్బులు లేవు. ఇతరత్రా అవసరమైన వస్తువులు కూడా లేవు. గాయపాలై ఉండటం, ఆకలి, కఠిన మంచు వాతావరణం మధ్య వారి పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అయితే ఇతర దేశాల పౌరులకు ఆయా దేశాల రాయబార కార్యాలయాల నుంచి తక్షణ సాయం అందుతోంది. భారత యువకులకు మాత్రం భారత రాయబార కార్యాలయం నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి తమ పిల్లల భద్రత, వారు సురక్షితంగా తిరిగి వచ్చే విషయంలో ఆ యువకుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. అందువల్ల మీరు తక్షణం జోక్యం చేసుకొని భారత యువకులను సురక్షితంగా తీసుకురావాలని కోరుతున్నా. విదేశాంగ విధానం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి, అక్కడ చిక్కుకుపోయిన కేరళ యువతను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తున్నాను' అని వినయ్ విశ్వం పేర్కొన్నారు.

లడఖ్ డిమాండ్లపై పోరాటం ఆగదు

- మోదీ, అమిత్ షాను మేల్కొల్పడానికి ప్రయత్నిస్తున్నాం...
- 21 రోజుల నిరాహార దీక్షను ముగించిన వాంగ్‌చుక్

శ్రీనగర్: లడఖ్ డిమాండ్లపై తన పోరాటం కొనసాగుతుందని సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. 21 రోజుల పాటు ఉప్పు, నీటిని మాత్రమే సేవిస్తూ ప్రముఖ వాతావరణ కార్యకర్త, విద్యా సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్ లడఖ్‌కు రాష్ట్ర హోదా, హిమాలయ పర్యావరణ పరిరక్షణ డిమాండ్ చేపట్టిన తన నిరాహార దీక్షను మంగళవారం ముగించారు. 'లడఖ్ కోసం రాజ్యాంగపరమైన రక్షణలు, ప్రజల రాజకీయ హక్కుల కోసం నేను పోరాడుతూనే ఉంటాను' అని వాంగ్‌చుక్ నిరాహార దీక్షను ముగించినప్పుడు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర పాలిత ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో వేలాది మంది హాజరయ్యారు. అయితే ఇప్పుడు అదే డిమాండ్లపై నిరాహారదీక్ష ప్రారంభిస్తామని మహిళా సంఘాలు తెలిపాయి. అంతకుముందు, వాంగ్‌చుక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లడఖ్ ప్రజల డిమాండ్లను పరిష్కరిం చాలని కోరారు. ఉష్ణోగ్రతలు -10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయినప్పటికీ 350 మంది తనతో కలిసి ఉపవాస దీక్షలో పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా గాజు గ్లాసులో గడ్డకట్టిన నీటిని చూపుతూ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో వీడియో పోస్ట్ చేశారు. 'లడఖ్‌లోని హిమాలయ పర్వతాల దుర్బలమైన పర్యావరణ వ్యవస్థను, ఇక్కడ అభివృద్ధి చెందుతున్న ప్రత్యేకమైన దేశీయ గిరిజన సంస్కృతులను రక్షించడానికి మన ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాను మేల్కొల్పడానికి మేము ప్రయత్నిస్తున్నాం' అని చెప్పారు.

అసాంజేను వెంటనే అప్పగించలేం: బ్రిటన్ కోర్టు

లండన్: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేను తక్షణమే అప్పగించలేమని బ్రిటన్ కోర్టు తెలిపింది. అమెరికాకు అప్పగిం చడాన్ని వ్యతిరేకిస్తూ జూలియన్ అసాంజే మరోసారి కోర్టుకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు మంగళవారం పేర్కొంది. అనేక కారణాలపై అసాంజే అప్పగింతకు వ్యతిరేకంగా అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉందని ఇద్దరు న్యాయమూర్తులు తమ తీర్పులో పేర్కొన్నారు. అమెరికా మరిన్ని హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. గూఢచర్యం చట్టం కింద 18 కౌంటీలలో అసాంజేను విచారించాల్సి ఉందని అమెరికా న్యాయవాదులు వాదించారు. అత్యంత రహస్యమైన అమెరికా మిలటరీ, దౌత్య సంబంధిత వివరాలను అసాంజే వికీలీక్స్ ద్వారా విడుదల చేశారని అమెరికా ఆరోపిస్తోంది. అమెరికాకు అప్పగించేందుకు ఆమోదిస్తూ బ్రిటన్ కోర్టు ఆదేశాలను సవాలు చేసేందుకు అనుమతించాలంటూ అసాంజే తరపు న్యాయవాదులు ఫిబ్రవరిలో కోరారు. ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని వాదించారు.

వైసీపీలో చేరికలు

- ఏలూరు, రాజంపేట టీడీపీ ఎంపీ ఇన్‌ఛార్జ్‌లు గోపాల్ యాదవ్, నరహరి చేరిక
- మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య కూడా...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నేతలు, పార్లమెంటు ఇన్‌ఛార్జ్‌లు ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాల యంలో మంగళవారం సీఎం జగన్ సమక్షంలో టీడీపీ ఏలూరు పార్లమెంటు ఇన్‌ఛార్జ్ గొరుముచ్చు గోపాల్ యాదవ్ వైసీపీలో చేరారు. ఏలూరు జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ గోపాల్ యాదవ్‌కు ఏలూరు ఎంపీ సీటు ఇస్తామని టీడీపీ అధిష్టానం హామీ ఇచ్చింది. దీంతో కొంతకాలంగా ఆయన ఏలూరు పార్లమెంటరీ కేంద్రంగా పార్టీ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల టీడీపీ ప్రకటిం చిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో గోపాల్‌కు టికెట్ దక్కలేదు. ఏలూరు టీడీపీ ఎంపీ సీటును టీడీపీ నేత యనమల రామకృష్ణుడు అల్లుడికి కేటాయిం చడంపై ఆయన తీవ్ర అసంతృప్తికి గురై పార్టీని వీడారు. అలాగే, టీడీపీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జ్ గంటా నరహరి ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. సీఎం జగన్ సమక్షంలో ఆయన వైసీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీ నెల్లూరు జిల్లా సీనియర్ నేత వేనాటి రామచంద్రా రెడ్డితో పాటు టీడీపీ వెంకటగిరి సీనియర్ నాయ కులు డాక్టర్ మస్తాన్ యాదవ్, అనేక మంది టీడీపీ నేతలు వైసీపీలో చేరారు. వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త పి.వి.మిధున్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తదితరులతో కలిసి సీఎం జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య వైసీపీలో చేరారు. సీఎం జగన్ ఆయనకు వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విశాఖపట్నంకు చెందిన జనసేన నేత బొడ్డేటి అనురాధ, సీనియర్ నాయకులు జి.వి.రాజు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, గాజువాక వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఉత్తర వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హాజరయ్యారు.

జనసేన విజయవాడ తూర్పు ఇన్‌ఛార్జ్ బత్తిన రాము, టీడీపీ మాజీ కార్పొరేటర్ల చేరిక

విజయవాడకు చెందిన అనేక మంది టీడీపీ మాజీ కార్పొరేటర్లు, జనసేన విజయవాడ తూర్పు ఇన్‌ఛార్జ్ బత్తిన రాము, ఆ పార్టీ ముఖ్య నేతలు సీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువాలు కప్పుకున్నారు. గండూరి మహేష్, నందెపు జగదీష్ (మాజీ కార్పొరే టర్లు), కొక్కిలిగడ్డ దేవమణి (మాజీ కోఆప్షన్ మెం బర్), టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రెటరీ కోసూరు సుబ్ర హ్మణ్యం (మణి), గోరంట్ల శ్రీనివాసరావు తదితరులు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు, ఎమ్మెల్సీ రుహుల్లా, వైసీపీ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాశ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు మినహాయింపు ఎందుకు?

సీఏఏ అమలుపై యూఎస్‌సీఐఆర్ఎఫ్ ప్రశ్న

న్యూఢిల్లీ: పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ స్పష్టంగా ముస్లిం మైనారిటీలను మినహాయించిందని యుఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) పేర్కొంది. సీఏఏ అమలు కోసం కేంద్రం విడుదల చేసిన నిబంధనల నోటిఫికేషన్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. మతం, విశ్వాసాల ఆధారంగా ఏ ఒక్కరి పౌరసత్వాన్ని తిరస్కరించకూడదని స్పష్టం చేసింది. యూఎస్‌సీఐఆర్ఎఫ్ విదేశాలలో మతపరమైన స్వేచ్ఛను పర్యవేక్షించడానికి, విశ్లేషించడానికి, నివేదించడానికి అమెరికా కాంగ్రెస్ సభ్యులతో స్థాపించబడిన స్వతంత్ర, ద్వైపాక్షిక సమాఖ్య సంస్థ. వివాదాస్పద సీఏఏ పొరుగు దేశాల నుండి పారిపోయి వచ్చిన శరణార్థులకు భారత్ మతపరంగా ఆశ్రయం కల్పిస్తోందని యూఎస్‌సీఐఆర్ఎఫ్ కమిషనర్ స్టీఫెన్ సెచ్నక్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హిందువులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులకు సీఏఏ ఆశ్రయం కల్పించినపుడు...ఈ చట్టం ప్రత్యేకంగా ముస్లింలకు మాత్రమే ఎందుకు మినహాయింపునిచ్చిందని ప్రశ్నించారు. ఈ చట్టం వాస్తవంగా పొరుగుదేశాల్లో హింసకు గురైన మైనారిటీలకు రక్షణ కల్పించేందుకు రూపొందించినట్లైతే... బర్మా నుండి వచ్చిన రోహింగ్యా ముస్లింలకు, పాకిస్థాన్ నుండి వచ్చిన అహ్మదీయ ముస్లింలు, అఫ్గానిస్థాన్ నుండి వచ్చిన హజారా షాహిలు సహా ఇతరులకు కూడా చట్టంలో స్థానం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై టామ్ లాంటోస్ హ్యూమన్ రైట్స్ కమిషన్ గతవారం చేపట్టిన విచారణలో సెచ్నక్ వివరణనిచ్చారు. భారత్‌లోని మత స్వేచ్ఛ అంశాలను బహిరంగంగా చర్చించాలని యుఎస్ కాంగ్రెస్ సభ్యులను యూఎస్‌సీ ఐఆర్ఎఫ్ కోరింది. ప్రభుత్వ ప్రతినిధులతో, ముఖ్యంగా కాంగ్రెస్ సభ్యులతో చర్చలలో మత స్వేచ్ఛ అంశాన్ని చేర్చాలని పిలుపునిచ్చింది. మత స్వేచ్ఛను గౌరవించడం, అన్ని వర్గాలకు చట్ట ప్రకారం సమానంగా రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలు అమలయ్యేలా చూడాలని యుఎస్‌సీఐఆర్ఎఫ్ కమిషనర్ డేవిడ్ కర్రీ పేర్కొన్నారు. మైనారిటీ వర్గాలకు మద్దతుగా నిలిచిన మానవహక్కుల కార్యకర్త లను నిర్బంధం నుండి విడుదల చేసేందుకు భారత అధికారులతో కలిసి పని చేయాలని యూఎస్‌సీఐఆర్ఎఫ్ అమెరికా ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

పార్టీ కోసం రూ.10 కోట్ల విరాళం

సొంత డబ్బు అందించిన పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-గుంటూరు: జనసేన పార్టీ ఉన్నతి కోసం మొదటి నుంచి తన స్వార్జితాన్ని వెచ్చిస్తూ వస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మరోసారి భారీ విరాళం అందించారు. తన పారితోషికం నుంచి ఎప్పటికప్పుడు పార్టీకి కాకుండా సామాజిక సేవలకు, అధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆపదలో ఉన్న వారిని ఆదుకొనేం దుకు విరాళం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం జనసేన పార్టీ నిర్వహణ అవసరాల నిమిత్తం రూ.10 కోట్ల స్వార్జితాన్ని విరాళంగా అందించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సమక్షంలో పార్టీ కోశాధికారి ఏవీ రత్నంకి విరాళం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడపించడానికి మోతీలాల్ నెహ్రూ వంటి గొప్ప నాయకులు తమ స్వార్జితాన్ని ఉద్యమానికి విరా ళంగా ఇచ్చారన్నారు. ఆ రోజుల్లో తమ సొంత డబ్బును వెచ్చిం చిన తీరు గొప్పదని, ఓ సదాశయం కోసం, రాష్ట్ర భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జనసేన సాగిస్తున్న రాజకీయ ప్రయాణానికి తన వంతుగా ఇప్పుడు ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం రూ.10 కోట్లు అందజేస్తున్నానన్నారు. ఇది పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నానని, జనసేన పార్టీ ప్రయాణానికి సగటు కూలి తన చిన్నపాటి సంపాదనలో రూ.వంద పక్కన పెట్టి పార్టీ ఎదుగుదలకు ఎంత గానో తోడ్పాడుతున్నారన్నారు. ఓ బేల్దారుడు రూ.లక్ష విరాళం అందించాడు. పింఛను నుంచి వచ్చే సొమ్ములో కొంత భాగం పార్టీకి తమ వంతుగా పంపుతున్న సగటు మనుషులెందరో ఉన్నారు. వారంతా ఎన్నో ఆశలతో, ఆశయాలతో నిర్మించిన పార్టీ కోసం తమ వంతు సాయం అందిస్తున్నారు. అలాంటి వారి స్ఫూర్తితో తాను సినిమాల ద్వారా వచ్చిన తన కష్టార్జితాన్ని, ప్రభుత్వానికి పన్నులు కట్టిన తర్వాత తన దగ్గర ఉన్న డబ్బును పార్టీ కోసం అందించడం చాలా సంతోషంగా ఉందని పవన్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, పార్టీ నేతలు మర్రెడ్డి శ్రీనివాస్, పంచకర్ల సందీప్, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంజాబ్‌లో బీజేపీ ఒంటరి పోరు

శిరోమణి అకాలీదళ్‌తో పొత్తు చర్చలు విఫలం

చండీగఢ్: వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ ఎన్డీయే కూటమి నుంచి బయటికెళ్లిన శిరోమణి అకాలీదళ్ తిరిగి ఆ కూటమిలో చేరనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. రెండు పార్టీలూ కలిసే లోక్‌సభ ఎన్నికలకు వెళ్తాయని ప్రచారం జరిగింది. ఆ మేరకు చర్చలూ నడిచాయి. తాజాగా ఈ చర్చలకు బ్రేక్ పడింది. బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తానని ప్రకటించింది. దీంతో పంజాబ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు జూన్ ఒకటిన జరిగే ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొననుంది. ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్, బీజేపీ, శిరోమణి అకాలీదళ్ వేర్వేరుగా పోటీ పడనున్నాయి. 2020 సెప్టెంబరులో ఎన్డీయే నుంచి అకాలీదళ్ బయటకెళ్లింది. అయితే, సార్వత్రిక ఎన్నికల వేళ ఎన్డీయే నుంచి బయటకెళ్లిన పార్టీలను బీజేపీ కలుపుకొంటూ వస్తోంది. దీంతో అకాలీదళ్‌ను కూడా కలుపుకొంటారా అని అమిత్ షాను ఇటీవల మీడియా ప్రశ్నించగా... చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్డీయే పార్టీలన్నీ ఏకమవ్వాల్సి ఉందని ఆకాంక్షించారు. వారం తిరగకముందే ఆ పార్టీ నుంచి ఒంటరి పోరు నిర్ణయం వెలువడింది. ప్రజలు, కార్యకర్తలు, పార్టీ నేతల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జాఖడ్ పేర్కొన్నారు. 13 సీట్లలో ఐదారు సీట్లు బీజేపీ కోరగా అందుకు అకాలీదళ్ నిరాకరించడంతో పొత్తుకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. బీజేపీ నిర్ణయంపై శిరోమణి అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ స్పందించారు. కొన్ని జాతీయ పార్టీల్లా నంబర్ల గేమ్ కోసం తాము పాకులాడబోమని, విలువలకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.

ఒకే కుటుంబం... 1,200 మంది ఓటర్లు!

గువహటి: లోక్‌సభ ఎన్నికల వేళ... అస్సాంలోని తేజ్‌పూర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నేపాలీ పామ్ గ్రామం వార్తల్లో నిలిచింది. ప్రచారంలో భాగంగా స్థానిక అభ్యర్థులు ఈ పల్లె బాటపట్టారు. కారణం... ఈ గ్రామంలో నివసించే వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారే. రాన్ బహదూర్ అనే గోరా ఇక్కడి సోనిత్‌పూర్ జిల్లాలో స్థిరపడ్డారు. వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. అతడికి ఐదుగురు భార్యలు. 12 మంది కుమారులు, 10 మంది కుమార్తెలు. 1997లో ఆయన మరణించారు. ప్రస్తుతం ఆ కుటుంబం విస్తరించింది. దాదాపు 2,500 మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఓటర్లు 1,200 మంది. వీరంతా కుటుంబ పెద్దలు ఎంచుకున్న అభ్యర్థికే ఓటు వేస్తారు. దీంతో తేజ్‌పూర్ నియోజకవర్గంలో పోటీ చేసే ప్రతి అభ్యర్థి ఈ గ్రామ పెద్దలతో, ముఖ్యంగా రాన్ బహదూర్ థాపా పెద్ద కుమారుడు, ప్రస్తుత గ్రామాధిపతి టిల్ బహదూర్ థాపాతో సత్సంబంధాలు కొనసాగించడానికి ప్రయత్నిస్తుంటారు. "మా నాన్న ఐదుసార్లు పెళ్లి చేసుకు న్నారు. మేం 22 మంది పిల్లలం. ఒకే ఇంట్లో ఉండటం కష్టంగా ఉండటంతో విడిగా జీవిస్తున్నాం. ఇప్పుడు 300 కుటుంబాలు ఉన్నాయి. మాకు 65 మంది మనవళ్లు, 70 మంది మనవరాళ్లు ఉన్నారు" అని టిల్ బహదూర్ తెలిపారు.

జీపీఎస్ జామింగ్... యూరప్‌లో విమానాలపై ఎఫెక్ట్!

న్యూఢిల్లీ: విమానాలకు అత్యంత కీలకమైన నావిగేషనల్ సిగ్నల్స్‌కు సంబంధించి యూరప్‌లో కొంత కాలంగా తరచూ ఆటంకాలు ఎదురవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజాగా తూర్పు యూరప్‌లో జీపీఎస్ జామింగ్ తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్లు తెలుస్తోంది. గడిచిన రెండు రోజుల్లోనే దాదాపు 1,600లకు పైగా విమానాలు వీటి బారిన పడినట్లు జీపీఎస్ ట్రాకింగ్ సైట్లు పేర్కొంటున్నాయి. మరోవైపు, వీటికి రష్యానే కారణం కావచ్చని పలు యూరప్ దేశాలు అను మానం వ్యక్తం చేస్తున్నాయి. బాల్టిక్ ప్రాంతాన్ని నకిలీ జీపీఎస్ సిగ్నల్స్ సమస్య పీడిస్తున్నట్లు వీటిని ట్రాక్ చేసే ఓపెన్-సోర్స్ ఇంటెలిజెంట్ గ్రూప్ ఇటీ వల వెల్లడించింది. ఈ క్రమంలో గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే 1,614 విమానాలు ప్రభావిత మైనట్లు పేర్కొంది. పోలాండ్, దక్షిణ స్వీడన్ ప్రాం తాల్లో ఈ సమస్య అధికంగా ఉందని తెలిపింది. ఫిన్లాండ్‌లోనూ ఇదే పరిస్థితి. బాల్టిక్ సముద్రంతో పాటు నాటో దేశాల సమీపంలోకి వచ్చే పౌర విమానాలు ఇటువంటి సమస్య ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఇది సాధారణంగా జరిగే జీపీఎస్ జామింగ్ కాదని... గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతోందని వెల్లడించింది. ఇదే సమయంలో జీపీఎస్ వ్యవస్థను నిలిపివేసే సామర్థ్యం రష్యాకు ఉందని స్వీడన్ ఆర్మీ కూడా ఇటీవల అనుమానం వ్యక్తం చేయడం గమనార్హం. మరోవైపు గతేడాది ఇరాన్-ఇరాక్ గగనతలంలో విమానాలు తరచూ దారి తప్పుతున్నట్లు వెల్లడైంది. నకిలీ జీపీఎస్ సిగ్నల్స్ వల్లే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నావిగేషన్ వ్యవస్థను సైతం ఏమార్చి విమానాలను తప్పుదోవ పట్టించేంత శక్తిమంతంగా ఆ సంకేతాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

ఏమిటీ సిగ్నల్ స్పూఫింగ్...

నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి, నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరి స్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా... ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. ఇలాంటి ఘటనలు తరుచూ వెలుగులోకి వస్తున్నప్పటికీ పౌర విమానాలే లక్ష్యంగా ఇటీవల మరింత పెరగడం ఆందోళన కలిగించే విషయం.

మిస్ యూనివర్స్ పోటీల్లో తొలిసారి సౌదీ అరేబియా ప్రాతినిధ్యం!

రియాద్: (సౌదీ అరేబియా): ఫ్యాషన్ రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మంగా భావించే మిస్ యూనివర్స్-2024 పోటీలకు సౌదీ అరేబియా సిద్ధమైంది. రూమీ అల్కహ్తాని (27) అనే అందాల భామ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా రూమీ వెల్లడించారు. అంతర్జాతీయ వేదికగా జరిగే ఓ అందాల పోటీల్లో పాల్గొనే తొలి సౌదీ యువతిగా నిలవనుంది. 73వ మిస్ యూనివర్స్ పోటీలు ఈ ఏడాది సెప్టెంబరు 28న మెక్సికోలో నిర్వహించనున్నారు. రియాద్‌కు చెందిన రూమీ అల్కహ్తాని ఈ పోటీల్లో అధికారికంగా పాల్గొననున్నారు. ఇటీవల మలేసియాలో నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ గ్లోబల్ ఏసియన్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె... ప్రపంచ సంస్కృతుల గురించి తెలుసుకోవడంతోపాటు సౌదీ సంప్రదాయ, వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే తన ప్రయత్నమని అన్నారు. ప్రాంతీయంగా నిర్వహించిన పలు అందాల పోటీల్లో రూమీ పాల్గొన్నారు. మిస్ సౌదీ అరేబియా కిరీటాన్ని దక్కించుకున్నారు. మిస్ మిడిల్ ఈస్ట్ (సౌదీ అరేబియా), మిస్ అరబ్ వరల్డ్ పీస్ -2021, మిస్ వుమెన్ (సౌదీ అరేబియా) వంటి టైటిళ్లను సొంతం చేసుకున్నారు. ఇన్‌స్టాలో 10 లక్షలకుపైగా ఫాలోవర్లు కలిగిన రూమీ... మిస్ యూనివర్స్ పోటీల్లో సౌదీ తరఫున ప్రాతినిధ్యం వహించనుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

'సందేశ్‌ఖలీ' అభ్యర్థినికి మోదీ ఫోన్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీ బాధితురాలు రేఖ పత్రాను బీజేపీ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమెతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆమెను 'శక్తి స్వరూపం'గా అభివర్ణించిన ప్రధాని... ఎన్నికల సన్నాహాలతోపాటు ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజల ఇబ్బందులు, తృణమూల్ కాంగ్రెస్ నేతల ఆగడాలను ఆమె ప్రధానికి వివరించినట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన షాజహాన్ షేక్, అతడి అనుచరులు... మహిళలపై అకృత్యాలకు పాల్పడటమే గాక, వారి భూములను బలవంతంగా లాక్కొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీరికి వ్యతిరేకంగా కొద్ది నెలల క్రితం ఇక్కడ మహిళలు చేపట్టిన ఆందోళనలకు రేఖ పత్రా నాయకత్వం వహించారు. టీఎంసీ నేతల అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచిన ఆమెను లోక్‌సభ ఎన్నికల్లో తమ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. బసిర్‌హట్ స్థానం నుంచి అవకాశం కల్పించింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోనే సందేశ్‌ఖలీ గ్రామం ఉంది. బసిర్‌హట్ నియోజకవర్గానికి ప్రస్తుతం తృణమూల్ నేత, నటి నుస్రత్ జహాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆమెను పక్కనబెట్టిన అధికారపార్టీ... వేరే వ్యక్తికి అవకాశం కల్పించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.